నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 29-4-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 218 | పేజీలు:4 | వెల: రూ.1/-

పనుల్లో వేగాన్ని పెంచండి : సీఎం కేసీఆర్

నల్లగొండ, ఏప్రిల్ 28:: నిధులు పుష్కలంగా ఉన్నాయని పనులలో వేగం పెంచాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా జిల్లాలో చేపట్టిన నెల్లికల్లు లిఫ్ట్ పనుల పురోగతి పై ఆయన గురువారం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌ను అరా తీశారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తండ్రి నరసింహా సంతాప సభలో పాల్గొనేందుకు గాను గురువారం మధ్యాహ్నం సీఎం నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చేరుకున్న విషయం తెలిసిందే.అనంతరం ఆయన ఇటీవల నుడా(నల్లగొండ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)గా రూపాంతరం చెందిన నల్లగొండ పురపాలక సంఘం అభివృద్ధి పనుల పురోగతిని అధికారులతో సమీక్షించారు. అనంతరం అక్కడే ఉన్న సాగర్ ఎమ్మెల్యే భగత్ తో మాట్లాడుతూ.. నెల్లికల్లు లిఫ్ట్, నందికొండ, హాలియా మున్సిపాలిటీల అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అందుకు ఎమ్మెల్యే భగత్ సమాధానమిస్తూ.. టెండర్లు పూర్తి అయ్యాయని పనులు త్వరలోనే మొదలు పెట్టనున్నట్లు వివరించారు.అందుకు సీఎం కేసీఆర్ స్పందిస్తూ అటు నెల్లికల్లు లిఫ్ట్ కు ఇటు నందికొండ, హాలియా మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు పుష్కలంగా ఉన్నాయని, పనుల్లో వేగాన్ని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ఎమ్మెల్యేలు భాస్కర్ రావు, కంచర్ల భూపాల్ రెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో 3.3 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో గూగుల్ క్యాంపస్

హైదరాబాద్, ఏప్రిల్ 28: అమెరికాలోని మౌంటెన్ వ్యూలో ఉన్న తమ ప్రధాన కార్యాలయం తర్వాత టెక్ దిగ్గజం గూగుల్ 3.3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైదరాబాద్‌లో నిర్మించతలపెట్టిన రెండవ అతిపెద్ద క్యాంపస్‌కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు.

తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. పౌర సేవలు, విద్య, ఇతర రంగాల్లో ప్రభుత్వానికి గూగుల్ సాంకేతిక సహకారాన్ని అందించనుంది. ఇప్పటికే అనేక ప్రాజెక్టుల్లో గూగుల్‌తో కలిసి పని చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ఈ ఒప్పందంతో మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గూగుల్ తన మూలాలను మరింత బలోపేతం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. గూగుల్ 2017 నుంచి తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేస్తోందని తెలిపారు. ఇంతకు ముందు చేసుకున్న ఎంవోయూలు గొప్ప కార్యక్రమాలకు దారి తీశాయన్నారు. యువత, మహిళలు, విద్యార్థులు, పౌరసేవల్లో మార్పు తీసుకురావడంపై దృష్టి సారించామని కేటీఆర్ పేర్కొన్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి : సబితా ఇంద్రారెడ్డి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. మే 6 నుంచి 24వ తేదీ వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు, మే 23 నుండి జూన్ 1 వరకు పదవ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనున్న నేపద్యంలో గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా, కార్యదర్శి దేవసేనతో కలిసి సంబంధిత జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరీక్షల నిర్వహణపై ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి మాట్లాడుతూ? కరోనా ప్రభావంతో రెండు సంవత్సరాలు పరీక్షలకు దూరంగా ఉన్న విద్యార్థులు రెండు సంవత్సరాల తర్వాత 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్నందున విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అలాగే మాస్ కాపీయింగ్ కు తావు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈసారి ఎండలు అధికంగా ఉండే మే మాసంలో పరీక్షలు నిర్వహిస్తున్నందున విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఇంటి నుండి పరీక్ష కేంద్రానికి వెళ్ళి పరీక్ష రాసి మళ్ళీ ఇంటికి చేరేవరకు వారి బాగోగులు చూసుకోవలసిన బాధ్యత అధికారులదేనని, విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాల చేరేలా ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులను నడిపి వాటిలో సగం సీట్లను విద్యార్థుల కోసం రిజర్వ్ చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అధికారులు మూడు రోజుల్లోగా అన్ని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి అవసరమైన విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ఫర్నిచర్, మరుగుదొడ్ల సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇతర అవసరమైన మందులతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి ఏఎన్ఎం లేదా ఆశ వర్కర్ ను అందుబాటులో ఉంచాలన్నారు. రెవెన్యూ శాఖ వారు పరీక్ష జరిగే సమయంలో పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధించాలని, జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచాలన్నారు. పోలీసులు గట్టి బందోబస్తుతో పరీక్ష ప్రశ్న పత్రాలను స్టోర్ చేసి ఎస్కార్ట్ సహాయంతో పరీక్ష కేంద్రాలకు తరలించాలని, పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోస్ట్ ఆఫీస్ వారు జవాబు పత్రాలను జాగ్రత్తగా తరలించాలన్నారు. రెండు సంవత్సరాల తర్వాత విద్యార్థులు పరీక్షలు రాయనున్న నీడున పరీక్షలు రాయడానికి కొందరు విద్యార్థులు ఆందోళన గురవుతారని, ఆందోళనకు గురయ్యే విద్యార్థులకు ఉచితంగా 9154951977, 9154951704, 9154951696, 91549 51703, 9154951 706, 9154951687 నెంబర్ల ద్వారా సైకాలజిస్ట్ లతో టెలి కౌన్సిలింగ్ ఇప్పించే ఏర్పాట్లు ప్రభుత్వం చేసిందని దీనిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సూర్య ప్రకాష్, డిఎం ఆర్టీసీ కిషన్ రావు, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, విద్యుత్ శాఖ డిఈ శ్రీనాథ్, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ మనోహర్, ఏఎంవిఐ సాంరిఛార్డ్ సన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉచిత వైద్య సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, ఏప్రిల్ 28 : రైతులకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. గురువారం వికారాబాద్ పట్టణం మార్కెట్ యార్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ.. సేవా ధృక్పథంతో రైతులకోసం, హమాలీ కార్మికుల కోసం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు.రైతులు, కార్మికులు, ట్రేడర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ముద్ద దీప, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఏఎంస్సీ చైర్మన్, ప్రజా ప్రతినిధులు, డైరెక్టర్లు , పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం



పెట్టుబడిదారులకు మంచి వాతావరణం కల్పిస్తున్నాం: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 28: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి మంచి వాతావరణాన్ని కల్పిస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. 2030 లోపు లైఫ్ సైన్సెస్ రంగంలో 100 బిలియన్ డాలర్ల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో థర్మో ఫిషర్స్ ఇండియా ఇంజినీరింగ్ సెంటర్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. లైఫ్ సైన్సెస్‌లో డేటా సైన్స్ కలుస్తుందన్నారు. థర్మో ఫిషర్స్ పరిశోధన, అభివృద్ధి సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు. 15 మిలియన్ డాలర్ల పెట్టుబడితో ఈ సంస్థ ఏర్పడుతున్నదని చెప్పారు. దీంతో నైపుణ్యం కలిగిన 450 మందికిపైగా ఇంజినీర్లు పనిచేస్తారన్నారు.

థర్మో ఫిషర్స్ కొత్త ఉత్పత్తులు, విశ్లేషణాత్మక పరిష్కారాలకు కేంద్రంగా ఉండనుందని చెప్పారు. ఈ సంస్థ పరిశోధన కోసం ఏటా 1.4 బిలియన్ డాలర్లు ఖర్చవుతుందని వెల్లడించారు. ఈ సంస్థ ఇప్పటికే ఉత్పత్తి, భూ, నీటి వనరులపై పరిశోధన చేస్తున్నదని తెలిపారు. గత నెలలో బోస్టన్‌లో థర్మో ఫిషర్స్ ప్రతినిధులను కలిశానని గుర్తుచేశారు.పరిశోధన కేంద్రాల విషయంలో ఆసియాలోనే క్రియాశీలక స్థానంలో ఉన్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. నైపుణ్యం, సామర్థ్యం విషయంలోనూ హైదరాబాద్‌ది ప్రత్యేక స్థానమని చెప్పారు. నగరంలో ఇప్పటికే ఐడీపీఎల్, ఇక్రిశాట్, సీఎస్ఐఆర్ వంటి ఎన్నో పరిశోధన కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్లోబల్ కేపబిలిటి సెంటర్లకు కూడా హైదరాబాద్ మంచి ప్రదేశమని వెల్లడించారు.

తార్నాక టీఎస్ ఆర్టీసీ ఆస్పత్రిలో నర్సింగ్ కాలేజీ ప్రారంభం

హైదరాబాద్, ఏప్రిల్ 28:తార్నాకలోని టీఎస్ ఆర్టీసీ ఆస్పత్రి ఆవరణలో నూతన నర్సింగ్ కాలేజీ నిర్మాణానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ వీసీ సజ్జనార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. దీంతో పాటు ఆర్టీసీ ఆస్పత్రి ఆవరణలోని ఓ బిల్డింగ్‌లో తాత్కాలిక నర్సింగ్ కాలేజీని ప్రారంభించారు. దీనికి యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఇప్పటికే అనుమతి ఇచ్చింది. మొత్తం 50 సీట్లకు అడ్మిషన్లు ఉంటాయి. ఇందులో కన్వీనర్ కోటా కింద 30 సీట్లు, మేనేజ్‌మెంట్ కోటా కింద 20 సీట్లు ఉన్నాయి.ఇక రూ. 80 లక్షల వ్యయంతో 20 పడకల ఐసీయూ, నాలుగు బెడ్లతో కిడ్నీ సెంటర్, రూ. 15 లక్షలతో డయాలసిస్, రూ. 1.2 కోట్లతో రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ వారి ఆక్సిజన్ ప్లాంట్, రూ. 1.5 కోట్లతో నిర్మించిన క్యాంటీన్‌ను ప్రారంభిం చారు. ఇప్పటి వరకు ఆర్టీసీ ఆస్పత్రిలో కేవలం ఆర్టీసీ ఉద్యోగులకు మాత్రమే వైద్య సేవలు అందించేవారు. నేటి నుంచి ఇతరులకు కూడా సాధారణ ఫీజులు తీసుకొని ఓపీ సేవలు అందించనున్నారు.

ఇఫ్తార్ విందు ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి : మంత్రి తలసాని

హైదరాబాద్, ఏప్రిల్ 28: ఈ నెల 29 న ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్ విందు ఏర్పాట్లను పమంత్రులు తలసాని, మహమూద్ అలీ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ అన్ని పండుగలను సమానంగా చూస్తున్నారన్నారు. సీఎం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో పండుగలను నిర్వహిస్తున్నామన్నారు.

ఇఫ్తార్ విందుకు వచ్చే ప్రతినిధులకు ప్రత్యేక పాస్‌లను జారీ చేశామన్నారు. రంజాన్ సందర్భంగా పేద ముస్లింలకు ప్రభుత్వం తరపున దుస్తులను పంపిణీ చేస్తున్నామని ఆయన వివరించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులు ఉంటాయన్నారు. సీఎం కేసీఆర్ హాజరయ్యే ఇఫ్తార్ విందు సందర్భంగా ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాల ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆయిల్ పామ్ సాగుచేసే రైతులకు ప్రత్యేక మొబైల్ యాప్: సీఎస్

హైదరాబాద్, ఏప్రిల్ 28:రాష్ట్రంలో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ చేపట్టే రైతులకు మరింత విస్తృత సమాచారం అందించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్ రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి సోమేశ్ కుమార్ తెలిపారు.

ప్రస్తుత 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఐదులక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ ను చేపట్టాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ విధించిన లక్ష్యం పై నేడు ఆర్థిక, వ్యవసాయ, పరిశ్రమలు, ఉద్యానవనశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు , పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఆయిల్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ డైరెక్టర్ అఖీల్,ఉద్యానవన శాఖ సంచాలకులు వెంకట్రామ్ రెడ్డి లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎస్ సోమేశ్ కుమార్ మాట్లాడుతూ, రైతులకు 4 నుండి 5 రేట్లు లాభసాటిగా ఉండే ఆయిల్ పామ్ తోటలను 20 లక్షల ఎకారాల్లో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆయిల్ పామ్ పెంపకానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలను బడ్జెట్ లో ప్రత్యేకంగా కేటాయించిందని గుర్తుచేశారు.

రాష్ట్రంలో ప్రస్తుత సంవత్సరంలో 1 ,85,000 ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటలను చేపట్టేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ తోటలను పెంచేందుకు భూములు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు.

నల్లగొండపై ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు..

నల్లగొండ, ఏప్రిల్ 28:: నల్లగొండ పై ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి వరాల జల్లు కురిపించారు. నల్లగొండ మున్సిపాలిటీని ఆధునికరించేందుకు గాను నుడా(నల్లగొండ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) గా ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు మరిన్ని వరాలు ప్రకటించారు. నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తండ్రి దివంగత నర్సింహ దశదిన కర్మలో పాల్గొనేందుకు సీఎం గురువారం నార్కట్‌పల్లికి చేరుకున్నారు.

అనంతరం జిల్లాకు చెందిన విద్యుత్ శాఖామంత్రి జగదీష్ రెడ్డి, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ మందాడి సైదిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, మున్సిపల్ కమిషనర్ రమణాచారి తదితరులతో కలిసి నుడా పై సీఎం కేసీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రం ప్రవేశంలో ఉన్న మర్రిగూడ బైపాస్ రోడ్ పై ఫ్లైఓవర్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

అంతే గాకుండా నల్లగొండ నడిబొడ్డున ఉన్న పెద్ద గడియారం సెంటర్‌లో ప్రస్తుతం ఉన్న ఆర్ అండ్ బీ అతిథి గృహం స్థానంలోనే అధునాతన సౌకర్యాలతో నాలుగు అంతస్థుల ఆర్ అండ్‌బీ వసతి గృహం నిర్మిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. దానికి తోడు నల్లగొండ-నాగార్జున సాగర్ రహదారిపై ఉన్న ఎస్ఎల్‌బీసీ కార్యాలయ ప్రాంగణంలో చీఫ్ ఇంజినీర్ కార్యాలయం నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. కాగా, సీఎం కేసీఆర్ ప్రకటనలతో జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

క్లిష్ట పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొన్న ఆర్టీసీ: మంత్రి పువ్వాడ

హైదరాబాద్, ఏప్రిల్ 28: క్లిష్ట పరిస్థితులను ఆర్టీసీ సమర్ధవంతంగా ఎదుర్కొన్నదని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. సంస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా కొత్త బస్సులు కొనుగోలు చేయాలని భావిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్ తార్నాకలోని ఆర్టీసీ దవాఖానలో నర్సింగ్ కాలేజీని సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జనార్‌తో కలిసి మంత్రి పువ్వాడ అజయ్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆర్టీసీ నర్సింగ్ కళాశాల ప్రారంభం శుభపరిమాణం అని చెప్పారు. దవాఖానను మరింత బలోపేతం చేయాలన్నారు.ఎలక్ట్రిక్ బస్సులు వాడితే డీజిల్ ధరల భారం తగ్గించుకోవచ్చని వెల్లడించారు. డీజిల్ ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయని చెప్పారు. డీజిల్ ధరలు పెంచుతున్న కేంద్రం.. రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాట్‌ను తగ్గించుకోవాలని అంటున్నదని విమర్శించారు. లాభాల బాటలో ఉన్న సంస్థలను కేంద్రం అమ్మకానికి పెడుతు న్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.ఆర్టీసీని బలోపేతం చేస్తున్నామని సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయబోతున్నామని చెప్పారు. ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు బోర్డు ఆమోదం తెలిపిందన్నారు. తార్నాక దవాఖానను మరింత అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఆర్టీసీ కాపాడుకుంటామని చెప్పారు.

నూతన సచివాలయంలో చర్చి నిర్మాణానికి శంకుస్థాపన

హైదరాబాద్, ఏప్రిల్ 28:నూతన సచివాలయం నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. అయితే సచివాలయంలో మందిరం, చర్చి, మసీదు నిర్మిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సచివాలయంలో చర్చి నిర్మాణానికి మెదక్ బిషప్ ఏసీ సాలమన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బిషప్ సాలమన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, చర్చి పనులు ప్రారంభించారు. 500 గజాల విస్తీర్ణంలో రూ. 1.5 కోట్లతో చర్చి నిర్మించనున్నారు.

ఇటీవలే ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన సచివాలయం నిర్మాణ పనులను పరిశీలించిన సంగతి తెలిసిందే. దాదాపు 9 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 6 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయి. సచివాలయం ముందు భాగంలోని ఎలివేషన్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అనుకున్న సమయానికి సచివాలయం పనులు పూర్తి చేయాలని అధికారులు, ఇంజినీర్లను సీఎం సూచించిన విషయం విదితమే.

29న ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్ విందు.. ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

హైదరాబాద్, ఏప్రిల్ 28:రాష్ట్రం ఏర్పాడినప్పటి నుంచి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇఫ్తార్ (ఎటబిజీతీ) విందు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అన్ని పండుగలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలి, పండుగలను గొప్పగా జరుపుకోవాలనేది సీఎం కేసీఆర్ ఉద్దేశమన్నారు. ఈ నెల 29న ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు జరుగనుంది. ఈ నేపథ్యంలో ఇఫ్తార్ ఏర్పాట్లను మంత్రి మహమూద్ అలీతో కలిసి తలసాని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ పండుగ సంర్భంగా ముస్లిం సోదరులు నెల రోజులపాటు ఉపవాస దీక్ష చేస్తారని చెప్పారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఇఫ్తార్ విందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విందుకు వచ్చే ప్రతినిధులకు ప్రత్యేక పాసులు ఇస్తున్నామని వెల్లడించారు.

ఇఫ్తార్ విందుకు సీఎం కేసీఆర్ హాజరవుతున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వాహనాల పార్కింగ్ కోసం స్టేడియం పరిసరాల్లో ఆరు ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లింలకు ప్రభుత్వం తరపున దుస్తులను పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇఫ్తార్ విందులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఛత్తీస్ ఘడ్‌లో నక్సల్స్ దుశ్చర్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలో నక్సల్స్ మరోసారి దుశ్చర్యకు పాల్పడ్డారు. నారాయణపూర్ జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలోని రెంగబెడలో రోడ్డు నిర్మిస్తున్న నాలుగు వాహనాలకు మావోయిస్టులు నిప్పుపెట్టారు. మంటల్లో నాలుగు వాహనాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనతో పరిసర ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది. ఈ ఘటనను అదనపు పోలీసు సూపరింటెండెంట్ ఐపీఎస్ అక్షయ్ కుమార్ ధృవీకరించారు.

కమలం పార్టీ కాదు.. కార్పొరేట్ పార్టీ : విప్ బాల్క సుమన్

హైదరాబాద్, ఏప్రిల్ 28:భారతీయ జనతా పార్టీ కమలం పార్టీ కాదని కార్పొరేట్ పార్టీ అని రాష్ట్ర ప్రభుత్వ విప్ బాల్కసుమన్ ఆరోపించారు. గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కు తొత్తుగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డులు పెద్ద సంఖ్యలో తెలంగాణ రావడమే తమ ప్రభుత్వ పనితీరుని నిదర్శనం అన్నారు.

తెరాసకు తెలంగాణలో ఏ పార్టీతో పోటీ లేదని రాబోయే ఎన్నికల్లో వంద స్థానాలు సాధిస్తామన్నారు. 2014లో 63, 2018లో ఎనభై ఎనిమిది స్థానాలు సాధించామని వచ్చే ఎన్నికల్లో వంద స్థానాలు సాధించి తెరాస ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తుందన్నారు.

29న నగరానికి రానున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

హైదరాబాద్, ఏప్రిల్ 28:: కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ శుక్రవారం హైదరాబాద్‌కు రానున్నారు. ఈసందర్భంగా రెండుజాతీయ రహదారులను జాతికి అంకితం చేయనున్నారు. మరో 10 జాతీయ రహదారులకు నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేస్తారు. అలాగే శంషాబాద్‌లో జరిగే కార్యక్రమానికి కూడా నితిన్ గడ్కరీ హాజరుకానున్నారు. ఆయనతో పాటు కేంద్రపర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి కూడా ఆయన వెంట ఉంటారు. రూ.7,853 కోట్ల వ్యయంతో 354 కి.మీ.జాతీయ రహదారుల నిర్మాణం జరిగింది.ప్రొటోకాల్ ప్రకారం సీఎం కేసీఆర్‌కు కూడా ఆహ్వానం అందింది. కాగా కేంద్ర మంత్రి గడ్కరీ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరవుతారా? లేదా? అన్నవిషయం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. కాగా గడ్కరీ కార్యక్రమానికి హాజరవుతానని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. కాగా శంషాబాద్ సమావేశంపై జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో మంత్రి కిషన్‌రెడ్డి భేటీ కానున్నారు.భారీ బహిరంగసభకు ఏర్పాట్లను మంత్రి కిషన్ రెడ్డి పర్యవేక్షించారు.

ఆదాయ అసమానతల కోరల్లో భారతం

ప్రపంచ మానవాళికి పట్టిన చీడపీడలు పేదరిక అగచాట్లు. అనేక దేశాల్లో పేదరికమనే చీకటి కమ్మేసి ఉంది. భారత దేశం ఎదుర్కొంటున్న పలు సమస్యల్లో పేదరికంతో పాటు అధిక జనాభా, నిరుద్యోగం, అనారోగ్యం, ఆహార అభద్రత లాంటివి అనాదిగా వెంటాడుతూనే ఉంటున్నాయి. భారతానికే సవాళుగా నిలిచిన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, లింగ అసమానతలు దేశాభివృద్ధికి ప్రతిబంధకాలుగా నిలుస్తున్నాయి. మన దేశ జనాభా అనుభవిస్తున్న ప్రధాన సమస్యగా 'ఆదాయ అసమానతలు (ఇన్‌కమ్ ఇనీక్వాలిటీస్)' గుర్తించబడినవి. వ్యక్తుల మధ్య సంపద, ఆదాయాల్లో అపారమైన తేడాలు ఉండడాన్ని ఆదాయ అసమానతలుగా గుర్తిస్తారు. ఆదాయ, సంపదల వ్యత్యాసాలు ఉన్న సమాజంలో అసంతృప్తులు, అశాంతి పెరుగుతాయి. 2020 ప్రపంచ సంపదలో 82 శాతం ఒక శాతం జనాభా చెంతనే ఉండగా, దాదాపు సగం జనాభా (370 కోట్లు) పేదరికంలో మగ్గుతున్నారని తేలింది. గత దశాబ్దంలో కుబేరుల ఆదాయం 6 రెట్లు పెరగగా, సాధారణ శ్రామికవర్గ ఆదాయం ఏటా 2 శాతం మాత్రమే పెరిగింది.

భారతదేశ సంపద:

ప్రపంచ బిలియనీర్ల జాబితాలో ఇండియా 3వ స్థానంలో (అమెరికా, చైనా తరువాత) ఉన్నది. అయినప్పటికీ భారత్‌లో కోవిడ్-19 కారణంగా 75 మిలియన్ల పేదలు అదనంగా పెరిగారు. కరోనా విజృంభణతో తక్కువ వేతనం పొందే ఉద్యోగుల ఆదాయం పడిపోవడం జరిగింది. అల్పాదాయ వర్గాలు నర్సింగ్, పోలీస్, టీచింగ్, క్లీనింగ్, స్టోర్ అటెండెంట్, హోటల్స్, మునిసిపల్/గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బంది, రెస్టారెంట్లు, టూరిజం లాంటి ఉద్యోగులు అతి తక్కువ వేతనం పొందినా, వైరస్‌కు సమీపంగా నిర్భయంగా పని చేశారు. ప్రపంచవ్యాప్తంగా 689 మిలియన్ల కడుపేదలు ఉండగా, ఇండియాలో వారి సంఖ్య 139 మిలియన్లు (20 శాతం) ఉన్నది. ప్రపంచ జనాభాలో 17.8 శాతం ఇండియన్లు ఉన్న విషయం మనకు తెలుసు. ఇండియాలో 2019 ఏడాదిలో 102 ముంది బిలియనీర్లు ఉండగా, 2020లో వారి సంఖ్య 140కి పెరిగి, వారి సంపద దాదాపు రెట్టింపు (596 బిలియన్ డాలర్లు) అయ్యింది. భారత దేశంలో 73 శాతం సంపద 1 శాతం జనాభా వద్దనే ఉన్నదని, 67 కోట్ల భారతీయులు (దాదాపు 50 శాతం) పేదరికంలో ముగ్గుతున్నారని సర్వే ఫలితాలు వివరిస్తున్నాయి. ప్రపంచ ఇనీక్వాలిటీ ల్యాబ్ రిపోర్ట్-2020 ప్రకారం 1980ల్లో చేపట్టిన ఆర్థిక సరళీకరణ విధానం అనంతరం అత్యధిక జనాభా కలిగిన ఇండియా, చైనాల్లో ఆదాయ అసమానతలు క్రమంగా పెరిగాయని విశ్లేషించారు. 1980ల్లో ధనికుల ఆదాయం 30 శాతం, 2019లో 56 శాతం వృద్ధి కావడం గమనించారు. కులమత వివక్షల కారణంగా భారతదేశంలో ఆదాయ అసమానతలు పెరుగుతున్నాయని నిర్ధారించారు. మన దేశంలోన 22.3 శాతం హిందువుల వద్ద 47 శాతం దేశ సంపద ఉందని, 7.8 శాతం హిందూ యస్‌టీ వర్గం వద్ద 3.7 శాతం సంపద మాత్రమే ఉందని తేలింది. మన దేశంలోని మహారాష్ట్ర, యూపీ, కేరళ, తమిళనాడు, హర్యానా రాష్ట్రాల్లోనే 50 శాతం వరకు సంపద దాగి ఉందని వివరిస్తున్నారు.

ఆదాయ అసమానతలకు కారణాలు:

ఆదాయ అసమానతలు మె?గ్గలు తొడగడానికి ముఖ్య కారణంగా నిరుద్యోగం, అండర్‌ఎంప్లాయ్‌మెంట్ సమస్యలను తొలుత గుర్తించారు. అర్హతకు తగ్గ ఉద్యోగం లభిస్తేనే ఆదాయాలు పెరుగుతూ, అసమానతలు తగ్గుతూ, క్రియాశీలతలు/ఉత్పత్తులు/సాఫల్యతలు పెరుగుతాయి. శ్రమ దోపిడీతో ఆదాయాలు, నిరుపేదల శరీరాలు కుంచించుకు పోవడం చూస్తున్నాం. పేదరికం, నిరుద్యోగం, అసమానతలు విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉంటాయి. ఉద్యోగాల కల్పన, పనికి తగ్గ వేతనాలు దొరికితేనే ఆదాయ అసమానతలు తగ్గుతాయని గమనించాలి. పారిశ్రామిక, వ్యవసాయక లాభాలు/ఆదాయాలు తగ్గితే శ్రామికులు/దినసరి కూలీలకు ఆదాయాల్లో భారీ కోతలు విధించబడతాయని తెలుసు కోవాలి. ఒక వేళ లాభాలు పెరిగినా ఉద్యోగులు/శ్రామిక వర్గాల వేతనాలు పెరగడం అవాస్తవమని తెలుసుకుంటున్నాం. కుబేరులు ఆదాయాలకు తగిన పన్నులు కట్టకుండా, దొడ్డి దారిన పన్నులను ఎగవేయడం పరిపాటిగా కనిపించడంతో ప్రభుత్వ ఆదాయాలకు గండి పడడం, పేదలకు అభివృద్ధి ఫలాలు అందకపోవడం జరుగుతోంది.

ఆదాయ అసమానతల దుష్పరిణామాలు:

రాజ్యాంగం ప్రసాదించిన సామాజిక సమానత్వం, సమాన అవకాశాల కల్పన, సంపద సమానంగా పంపిణీ కావడం లాంటి హక్కులు నేటికీ కాగితాల్లోనే దాగి ఉన్నాయి. ప్రాంతీయ అసమానతలతో పాటు అవకాశాల్లో అసమానతలు దేశ సమాఖ్య స్ఫూర్తి పునాదులను బలహీనపరుస్తున్నాయి. ప్రభుత్వాలు సామాజిక, ఆర్థిక సమానత్వ సాధనకు భూసంస్కరణలు, సామాజిక భద్రత, పెన్షన్లు, నైపుణ్య శిక్షణల వంటి తగు పటిష్ట చర్యలను తీసుకోవాలి. అత్యంత కుబేరుల(సూపర్ రిచ్)కు కొమ్ముకాయకుండా, వారి సంపద నుంచి అధిక అనువంశిక పన్నులను విధించాలి. పారిశ్రామిక, ఔత్సాహిక వర్గాలను చేయూతను ఇవ్వడం, పన్నుల వసూళ్లను అమలు పరచడం జరగాలి. పారిశ్రామిక కుబేరుల చేతుల్లో ప్రభుత్వాలు కీలు బొమ్మలు కావడం అసమానతల పోషణకు ఆజ్యం పోస్తూనే, ఆదాయాలు పెంచుకోవడం, వ్యయాలు తగ్గించుకోవడం, లాభాలు పొందడం సర్వసాధారణం అవుతున్నది.

ఆదాయ అసమానతల తగ్గింపు మార్గాలు:

ప్రభుత్వాలు తమ పాలసీలను అమలు పరచడంతో పాటు కుబేరుల నుంచి ఆదాయ పన్ను చట్టాల ప్రకారం పన్నులు వసూలు చేయడంలో కఠినంగా వ్యవహరించాలి. విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జోడెడ్లలా సమన్వయంతో పని చేయాలేగాని, రైలు పట్టాల్లా సమాంతరంగా పని చేయకూడదని తెలుసుకోవాలి. ఆదాయ అసమానతలను రూపుమాపడానికి అన్ని వర్గాల ప్రజలకు కావలసిన పాలసీలను 'నీతి ఆయోగ్' తీసుకురావడానికి చొరవ చూపాల్సి ఉంది. నిరుపేద వర్గాలకు పని కల్పన, పనికి తగిన ఆకర్షణీయ వేతనాలు, అన్నివర్గాల సమాంతర సుస్థిరాభివృద్ధి సత్వరమే జరగాలి. ఆర్థిక, ఆదాయ సమానత్వ సాధనలో దేశ ప్రజలందరూ తమ తమ హక్కులతో పాటు బాధ్యతలను నిర్వహించాలి. ఆదాయ అసమానతలు భరతజాతికి పట్టిన చీడపీడలని, వాటి నిర్మూలనకు బహుముఖీన కోణాల్లో పని చేయాల్సి ఉందని గుర్తుంచుకోవాలి.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఉచిత శిక్షణ శిబిరాన్ని సందర్శించిన జిల్లా ఎస్.పి. యం.రమణ కుమార్

సంగారెడ్డి, ఏప్రిల్, 28 (నేటి నిజం ప్రతినిధి): పోలీసు నియామకాలకు సంబందించి అంబేద్కర్ భవన్లో నిర్వహిస్తున్న ప్రి రిక్రూట్మెంట్ ఫ్రీ కోచింగ్ శిక్షణ శిభిరాన్ని జిల్లా ఎస్.పి. శ్రీ. యం. రమణ కుమార్ సందర్శించారు. శిక్షణ పొందుతున్న యువతి యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 9 గంటల లోపు శిక్షణా కేంద్రానికి చేరుకొని, సాయంత్రం 5 గంటల వరకు ప్రతి అభ్యర్థి ఉండాలని సూచించారు. మూడు నెలలలో ఏ ఒక్క రోజు కూడా శిక్షణకు గైర్హజరు కావద్దని, వరుసగా రెండు మూడు రోజులు గైర్హాజరైన అభ్యర్థులను శిక్షణ కేంద్రం లోనికి అనుమతించమని తెలిపారు. ఫ్యాకల్టీ చెప్పే ప్రతి అంశాన్ని నోట్ చేసుకుని మళ్లీ ఇంటికి వెళ్ళగానే రివైజ్డ్ చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కేవలం పోలీసు ఉద్యోగాలకే కాకుండా అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్లో మన సంగారెడ్డి జిల్లాకే అత్యధికంగా ఉద్యోగాలున్నాయన్నారు. చదువంటే కష్టపడి కాదు, ఇష్టపడి చదవండి దీనివల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నిరుత్సాహం నిరాశ నుండి బయటపడి ఆత్మస్థైర్యంతో చదివితే విజయం సాధిస్తారు. పూర్తి పారదర్శకంగా మెరిట్ ప్రకారమే పోలీస్ సెలక్షన్స్ జరుగుతాయన్నారు. హైదరాబాద్ లో ప్రయివేట్ కోచింగ్ సెంటర్లలో ఇచ్చే కోచింగ్ కు ధీటుగా శిక్షణ ఉంటుందన్నారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులచే శిక్షణనిస్తున్నాం అన్నారు. ఉద్యోగం వస్తే మీకు మీ కుటుంబానికి సమాజంలో గౌరవం పెరుగుతుందన్నారు. జిల్లా పోలీసు, జిల్లా కలెక్టర్ సహాయ సహకారాలతో ఈ శిక్షణ ఇస్తున్నామని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణతో చదివి ఉద్యోగం సాధించాలని సూచించారు. సెల్ఫోన్లకు, వాట్సాప్, చాటింగ్, సినిమాలకు షికార్లకు దూరం ఉండాలని, మీ భవిష్యత్ ఇప్పుడు మీ చేతుల్లోనే ఉంది దాన్ని అందంగా తీర్చిదిద్దుతారో లేదా అనేది మీరు తీసుకునే నిర్ణయాన్ని బట్టి ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డి.యస్.పి. బాలాజీ, యస్.బి డి.యస్.పి. శ్రీనివాస్ నాయుడు, డి.టి.సి. డి.యస్.పి. ప్రభాకర్, సి.ఐ.లు రమేష్, లక్ష్మారెడ్డి లు, భాగ్య కిరణ్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ భాగ్య కిరణ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్మీడియేట్ పరీక్షలు సజావుగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలి - అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 28 (నేటి నిజం ప్రతినిధి): జిల్లాలో మే 6 నుండి 19 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియేట్ పరీక్షలు సజావుగా జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై విద్య, వైద్య, రెవిన్యూ, పోలీసు, విద్యుత్, ఆర్.టి.సి. పోస్టల్ తదితర అనుబంధ శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సాఫీగా నిర్వహించుటకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లలో భద్రపరుస్తున్న ప్రశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించుటకు, సెక్యూరిటీ ఏర్పాటు చేయడంతో పాటు, పరీక్షా కేంద్రాలకు అవసరమైన పోలీస్ బందోబస్త్ ను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షా కేంద్రాల పరిసరాలలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని సూచించారు. పరీక్షలు సాఫీగా నిర్వహించుటకు అవసరమైన సిబ్బందిని, ఇన్విజిలేటర్లను కేటాయించాల్సిందిగా విద్యాశాఖాధికారికి సూచించారు.

అన్ని పరీక్షా కేంద్రాల వద్ద థర్మల్ స్కానర్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తో అవసరమైన మందులు, ఓ.ఆర్ .ఎస్. ప్యాకెట్లతో ఏ.ఎన్.ఏం. లను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని, విద్యుత్ లో అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్ణీత సమయంలోగా పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆయా రోజులలో అదనంగా బస్సులు నడపాలని ఆర్టీసీ వారికి సూచించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు మొదటి సంవత్సరం 17,124 మంది, రెండో సంవత్సరం 15,390 మంది(మొత్తం 32,514 మంది) విద్యార్థులు హాజరు కానున్నట్లు ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్ తెలిపారు. పరీక్ష ల నిర్వహణకు 47 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తానని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి గోవింద రామ్, విద్య, పోలీసు పోస్టల్, విద్యుత్, రెవిన్యూ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మెసర్స్ చీనాబ్ వ్యాలీ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా 540 మెగావాట్ల క్వార్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు నిర్మాణానికి కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈరోజు 4526.12 కోట్ల రూపాయల పెట్టుబడితో జమ్ము కాశ్మీర్లోని కిస్టవర్ జిల్లా లోని చీనాబ్ నదిపై 540 మెగావాట్ల (ఎం.డబ్ల్యు) క్వార్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు కు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టును మెస్సర్స్ చీనాబ్ వ్యాలీ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (మెస్సర్స్ సివిపిపిఎల్) నిర్మిస్తుంది. ఇది ఎన్‌హెచ్‌పిసి, జెకెఎన్‌పిడిసి సంయుక్త కంపెనీ. 27.04.2022 నాటికి ఇందులో ఎన్ హెచ్‌పిసి వాటా 51 శాతం కాగా, జెకెఎన్‌పిడిసి వాటా 49 శాతంగా ఉంది.

ఈ ప్రాజెక్టు 1975.54 మిలియన్ యూనిట్లను సంవత్సరానికి 90 శాతం అంతకంటే ఎక్కువ విద్యుత్ ను నమ్మకంగా ఉత్పత్తి చేస్తుంది.

భారత ప్రభుత్వం మౌలిక సదుపాయాల ఖర్చుకోసం 69.80 కోట్లు గ్రాంటుగా సమకూరుస్తుంది. అలాగే జెకెఎస్పిడిసి మెసర్స్ సివిపిపిఎల్ లో ఈక్విటీ (49శాతం) కోసం జమ్ము కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి655.08 కోట్ల రూపాయలను కేంద్రం గ్రాంటుగా సమకూరుస్తుంది. ఎన్.హెచ్.పి.సి 51 శాతం ఈక్విటీని అంటే రూ 681.82 కోట్ల రూపాయలను తన అంతర్గత వనరులనుంచి సమకూరుస్తుంది.. ఈ జల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెకు 54 నెలల వ్యవధిలో పూర్తిఅవుతుంది, ఈ ప్రాజెక్టు నుంచి ఉత్పత్తి అనియన విద్యుత్ గ్రిడ్ బాలెన్సింగ్ఃకు ఉపయోగపడుతుంది. అలాగే విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగుపరుస్తుంది.

కేంద్రపాలిత ప్రభుత్వమైన జమ్ముకాశ్మీర్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఆచరణలోకి తెచ్చేందుకు, నీటి వినియోగ చార్జీలకు ప్రాజెక్టు ప్రారంభమైన నాటి నుంచి పది సంవత్సరాలపాటు మినహాయింపును వర్తింపచేస్తారు.

రాష్ట్ర వాటా జిఎస్‌టి తిరిగి చెల్లింపు(అంటే ఎస్‌జిఎస్‌టి), ఉచిత విద్యుత్‌ను ఏడాదికి రెండు శాతం వంతున డిక్రిమెంటల్ విధానంలో మినహాయిస్తుంది. అంటే కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్ముకాశ్మీర్‌కు ప్రాజెక్టు ప్రారంభమైన తొలి సంవత్సరం ఉచిత విద్యుత్ 2 శాతంగా ఉంటుంది. ఆ తర్వాత ఇది ఏడాదికి 2 శాతం వంతున పెరుగుతూ 6 వ సంవత్సరం , ఆతర్వాత నాటికి ఇది 12 శాతానికి చేరుతుంది.

ఈ ప్రాజెక్టు నిర్మాణ కార్యకలాపాల ప్రభావం ప్రత్యక్షంగా, పరోక్షంగా 2500 మందికి ఉపాధి కల్పిస్తుంది. ఇది మొత్తంగా కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్ము కాశ్మీర్ సామాజిక ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుంది. దీనికితోడు ఇది రూ 4,548.59 కోట్ల రూపాయల ఉచిత విద్యుత్, రూ 4,941.46 కోట్ల రూపాయల నీటి వినియోగ చార్జీల ద్వారా క్వార్ హైడ్రో విద్యుత్ ప్రాజెక్టు 40 సంవత్సరాల కాలంలో జమ్ము కాశ్మీర్ కు ప్రయోజనం దక్కుతుంది.

ప్రధానమంత్రి వీధి వ్యాపారుల స్వావలంబన నిధి 2022 మార్చి తర్వాత 2024 డిసెంబరు వరకూ కొనసాగించేందుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఇవాళ సమావేశమైన కేంద్ర మంత్రిమండలి ఆర్థిక వ్యవహారాల కమిటీ (సీసీఈఏ) "ప్రధానమంత్రి వీధి వ్యాపారుల స్వావలంబన నిధి" (పీఎం-స్వానిధి) కింద రుణాల మంజూరును 2022 మార్చి తర్వాత 2024 డిసెంబరు వరకూ కొనసాగించడంపై ఆమోదం తెలిపింది. ఈ మేరకు మెరుగైనరీతిలో పూచీకత్తులేని సరళ రుణాల మంజూరుకు తగిన మూలనిధికి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు డిజిటల్ లావాదేవీల అనుసరణ, వీధి వ్యాపారులు-వారి కుటుంబాల సమగ్ర సామాజిక-ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చే నిర్ణయం తీసుకుంది.

ఈ పథకం ద్వారా వీధి వ్యాపారులకు సరళ, పూచీకత్తులేని రుణాలు మంజూరు చేయబడతాయి. దీనికింద మొత్తంమీద రూ.5,000 కోట్లదాకా రుణాలివ్వాలన్నది లక్ష్యం. ఈ నేపథ్యంలో పథకం పొడిగింపునకు నేటి ఆమోదంతో రుణాల మొత్తం రూ.8,100 కోట్లకు పెంచబడింది. తదనుగుణంగా వీధి వ్యాపారులు తమ వ్యాపారం విస్తరించుకుని, స్వావలంబన సాధించేందుకు వీలుగా వారికి నిర్వహణ మూలధనం సమకూర్చబడుతుంది. దీంతోపాటు డిజిటల్ చెల్లింపులపై వ్యాపారులకు నగదు వాపసు సదుపాయం కోసం కూడా నిధుల కేటాయింపు పెంచబడింది.కేంద్ర మంత్రిమండలి తాజా ఆమోదంతో పట్టణ భారతంలోని దాదాపు 1.2 కోట్లమంది పౌరులకు ప్రయోజనం కలుగుతుందని అంచనా.పీఎం-స్వానిధి పథకం ఇప్పటికే గణనీయ విజయం సాధించింది. ఈ మేరకు 2022 ఏప్రిల్ 25నాటికి 31.9 లక్షల రుణాలు మంజూరు కాగా, 29.6 లక్షల రుణాల కింద రూ. 2,931 కోట్ల మేర సొమ్ము పంపిణీ చేయబడింది. ఇక 2వ రుణానికి సంబంధించి 2.3 లక్షల రుణాలు మంజూరు కాగా, 1.9 లక్షల రుణాల కింద రూ.385 కోట్లు పంపిణీ చేయబడింది. ఈ పథకం కింద లబ్ధిపొందిన వీధి వ్యాపారులు 13.5 కోట్లకు పైగా డిజిటల్ లావాదేవీలు నిర్వహించటం ద్వారా నగదు వాపసు కింద రూ.10 కోట్లు, వడ్డీ రాయితీ రూపంలో రూ.51 కోట్లు పొందారు.

మహమ్మారి విజృంభణ వల్ల చిన్నవ్యాపారాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడటంతో 2020 జూన్‌లో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే, ఆనాటి విపత్కర పరిస్థితులు నేటికీ తొలగిపోని కారణంగా వారిపై వీధి వ్యాపారులపై ఒత్తిడి కొనసాగుతోంది. అందుకే ఈ పథకం పొడిగింపు అవసరమైంది. పథకం అమలును 2024 డిసెంబరు వరకూ పొడిగించడంతో అధికారిక రుణమార్గాల అందుబాటు వ్యవస్థీకృతం అవుతుంది. తదనుగుణంగా వ్యాపారులు తమ వ్యాపార విస్తరణకు ప్రణాళిక రూపొందించుకోగలిగేలా కచ్చితమైన రుణవనరుకు హామీ లభిస్తుంది. అలాగే డిజిటల్ లావాదేవీల అనుసరణకు, రుణాలిచ్చే ఆర్థిక సహాయ సంస్థలకు నిరర్థక ఆస్తుల నివారణకు వీలు కలుగుతుంది. దీంతోపాటు వీధి వర్తకులు, వారి కుటుంబాల సంపూర్ణ సామాజిక-ఆర్థిక అభ్యున్నతి సాధ్యమవుతుంది.

ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఏర్పాటుకు సవరించిన ఖర్చు అంచనాలకు ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపిపిబి) ఏర్పాటుకు సవరించిన ప్రాజెక్టు పెట్టుబడికి ఆమోదం తెలిపింది. దీనిని 1435 కోట్ల రూపాయలనుంచి 2255 కోట్ల రూపాయలకు పెంచి రెగ్యులేటరీ నిబంధనలకు అనుగుణంగా ఈక్విటీని సమకూరుస్తారు. అలాగే రెగ్యులేటరీ అవసరాలు, సాంకేతికతను అప్‌గ్రేడ్ చేయాడానికి మరో 500 కోట్ల రూపాయలను భవిష్యత్ లో నిధులను సమకూర్చడానికి కూడా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ఈ ప్రాజెక్టు లక్ష్యం, అందుబాటులో, చవకగా బ్యాంకింగ్ సేవలను సామాన్యుడికి అందుబాటులోకి తేవడం. బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని వారికి అడ్డంకులు తొలగించడం, ఇంటివద్దకే బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం. ఈ ప్రాజెక్టు , తక్కువ నగదు చలామణి కి సంబంధించి భారత ఆర్థిక వ్యవస్థ దార్శనికతకు అద్దం పడుతుంది. అలాగే ఇది ఆర్థిక ప్రగతికి, ఆర్థిక సమ్మిళితత్వానికి దోహదపడుతుంది.

ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ 2018 సెప్టెంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా 650 బ్రాంచ్‌లు, కంట్రోలింగ్ ఆఫీసులలో ప్రారంభమైంది. ఐపిపిబి కి 1.36 లక్షల పోస్ట్ ఆఫీసులు ఉన్నాయి. ఇవి బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నాయి. 1.89 లక్షల పోస్ట్‌మెన్, గ్రామీణ్ డాక్ సేవక్ లు స్మార్ట్ ఫోన్, బయోమెట్రిక్ పరికరాల ద్వారా ఇంటిగుమ్మం వద్దకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తెస్తున్నారు.

ఐపిపిబి ని ప్రారంభించినప్పటి నుంచి ఇది 5.25 కోట్ల ఖాతాలను ప్రారంభించింది. సుమారు 82 కోట్ల ఆర్థిక లావాదేవీలు సుమారు రూ 1,61.811 కోట్ల రూపాయల మేరకు జరిగాయి . దీనికి తోడు 765 లక్షల ఎఇపిఎస్ లావాదేవీలు సుమారు 21 వేలా 343 కోట్ల రూపాయల మేరకు జరిగాయి. 5 కోట్ల ఖాతాలలో? 77 శా3తం ఖాతాలు గ్రామీణ ప్రాంతాలలో ప్రారంభమైనవి. ఇందులో 48 శాతం మహిళా కస్టమర్లు. వెయ్యి కోట్ల డిపాజిట్లు కలిగి ఉంది. సుమారు 40 లక్షల మంది మహిళా కస్టమర్లు ప్రత్యక్ష నగదు బదిలీ (డిబిటి) కింద 2500 కోట్ల రూపాయలు తమ ఖాతాలో అందుకున్నారు. సుమారు 7.8 లక్షల ఖాతాలు పాఠశాల విద్యార్థుల పేరుమీద ప్రారంభించారు.

ఆకాంక్షిత జిల్లాలలో ఐపిపిబి సుమారు 95.71 లక్షల ఖాతాలను తెరిచింది. ఇందులో సుమారు 602 లక్షల లావాదేవీలు రూ 19,487 కోట్ల రూపాయల మేరకు జరిగాయి. వామపక్ష తీవ్రవాదం (ఎల్ డబ్ల్యు ఇ) ఉన్న జిల్లాలలో 67.20 లక్షల ఖాతాలను ఐపిపిబి ప్రారంభించింది. సుమారు426 లక్షల లావాదేవీలలో 13, 460 కోట్ల రూపాయలు బదిలీ అయింది.

ఈ ప్రతిపాదన ల మొత్తం ఆర్థిక వ్యయం రూ.820 కోట్లు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవడం ద్వారా భారతదేశం అంతటా ఆర్థిక సేవలను మరింతగా పెంచే లక్ష్యంతో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్‌కు ఈ నిర్ణయం సహాయం చేస్తుంది.

ఏపీలో టెన్త్ హిందీ పేపర్ లీక్!

అమరావతి, ఏప్రిల్ 28:ఏపీలో పదో తరగతి పరీక్షలు జరుగుతున్న వేళ.. ప్రశ్న పత్రాలు లీక్ అవుతుండడం కలకలం రేపుతోంది. నిన్న నంద్యాల జిల్లాలో పేపర్ లీక్ కాగా.. తాజా శ్రీకాకుళం జిల్లాలో హిందీ పేపర్ లీక్ అయింది.

శ్రీకాకుళం జిల్లాలోని సరుబుజ్జిలి మండలం రొట్టవలస, షలంత్రి పరీక్ష కేంద్రాలా నుంచి గురువారం హిందీ పరీక్ష పత్రం బయటకు వచ్చినట్లుగా ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది. ముందుగా సోషల్ మీడియాలో ఇది ప్రచారం కావడంతో జిల్లా ఆంతా కలకలం రేపింది. సమాచారం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి పగడాలమ్మ రొట్టవలస కేంద్రానికి వచ్చి అక్కడ అధికారులతో మాట్లాడారు. దీనిపై పోలీసులు కూడా విచారిస్తున్నారు. అయితే ఈ రెండు కేంద్రాల నుంచి పరీక్ష పత్రం లీక్ కాలేదని, ఎక్కడో జరిగి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు.

కాగా పరీక్ష పత్రాలు లీక్ అయ్యాయన్న వార్తలు వింటున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పరీక్ష ప్రారంభమైన అర్ధ గంటకే పేపర్ లీక్ అయినట్లుగా తెలుస్తోంది. అయితే ఈ కేంద్రాల నుంచి పేపర్ లీక్ అయినట్లుగా ఆధారాలు ఏమీ లేవని పోలీస్ లు చెబుతున్నారు.

కాగా, నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లెలో పదో తరగతి ప్రశ్నాపత్రం లీక్ ఘటనలో 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. నిన్న తొలిరోజు గ్రామంలో పరీక్షలు ప్రారంభమైన గంటన్నర తరువాత ప్రశ్నాపత్రం లీక్ వదంతులు వ్యాపించాయి. ముందుగా అవాస్తమని కొట్టిపారేసిన విద్యాశాఖ, జిల్లా ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. విద్యాశాఖ, పోలీసులు కలిసి పాఠశాలలో విచారణ ప్రారంభించడంతో నిజమని తేలాయి. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

బడి బయట ఉన్న బాలికలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలి - స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్

మెదక్, ఏప్రిల్ 28 (నేటి నిజం ప్రతినిధి): పాఠశాలలకు వెళ్లని బడిబయట ఉన్న 11-14 ఏళ్ల లోపు కౌమార దశ బాలికలను గుర్తించి ప్రభంధ్ పోర్టల్ లో వివరాలు నమోదు చేయవలసినదిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. దేశంలో బడిబయట ఉన్న బాలికలను గుర్తించి పాఠశాలలో చేర్పించి మంచి విద్యతో పాటు వారిలో ప్రతిభ పాటవాలను పెంచుటకు, పౌష్టికాహ

ఫిజీలో శ్రీ సత్య సాయి సంజీవని హాస్పిటల్ ప్రారంభ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:ఫిజీ లో ఈ రోజు న జరిగిన శ్రీ శ్రీ సత్య సాయి సంజీవని ఆసుపత్రి ప్రారంభ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో సందేశం ద్వారా ఉపన్యసాన్నిచ్చారు.

ఈ సందర్భం లో ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ఈ ఆసుపత్రి ని ఏర్పాటు చేసినందుకు గాను ఫిజీ ప్రధాని కి మరియు ఫిజీ ప్రజల కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆసుపత్రి ఇరు దేశాల మధ్య సంబంధాల సంకేతం గా ఉంది. ఇది భారతదేశం మరియు ఫిజీ ఉమ్మడి ప్రస్థానం లో మరొక మజిలీ గా కూడా ఉంది అని ఆయన అన్నారు. బాలల గుండెజబ్బుల ఆసుపత్రి ఫిజీ లో ఆ తరహా ఏకైక ఆసుపత్రి కావడంతో పాటు గా యావత్తు దక్షిణ పసిఫిక్ ప్రాంతం లోనే ఆ తరహా ఒకటో బాలల ఆసుపత్రి కూడాను అని ఆయన అన్నారు. "హృదయ సంబంధి వ్యాధులు పెను సవాలు గా నిలచిన ప్రాంతం లో వేల కొద్దీ బాలల కు సరికొత్త జీవనాన్నిచ్చే మాధ్యమం గా ఈ ఆసుపత్రి మారనుంది." అని ప్రధాన మంత్రి అన్నారు. పిల్లలు ప్రపంచ శ్రేణి చికిత్స ను పొందడం ఒక్కటే కాకుండా అన్ని శస్త్ర చికిత్స లు ఎటువంటి ఖర్చు లేకుండా జరుగుతాయి అంటూ ఆయన తన సంతోషాన్ని వెలిబుచ్చారు. మరి దీనికి గాను ఆయన ఫిజీ లోని సాయి ప్రేమ్ ఫౌండేషన్ ను, ఫిజీ ప్రభుత్వాన్ని, భారతదేశం లోని శ్రీ సత్య సాయి సంజీవని చిల్డ్రన్స్ హార్ట్ హాస్పిటల్ ను ప్రశంసించారు.

బ్రహ్మం లో లీనమైన శ్రీ సత్య సాయి బాబా కు ప్రధాన మంత్రి ఈ సందర్భం లో ప్రణామాన్ని ఆచరించారు. సత్య సాయి బాబా నాటిన మానవ సేవ అనేటటువంటి ఒక చిన్న మొక్క ఇవాళ ఒక పెద్ద వట వృక్షం గా ఎదిగి యావత్తు మానవాళి కి ఉపయోగపడుతున్నది అని ప్రధాన మంత్రి అన్నారు. "శ్రీ సత్య సాయి బాబా ఆధ్యాత్మికత ను కర్మకాండ బారి నుంచి విముక్తం చేసి ప్రజల సంక్షేమం తో ముడి పెట్టే అద్భుతమైన పని ని చేశారు అని గుర్తు కు తెచ్చుకొన్నారు. విద్య, ఆరోగ్యం రంగాల లో సత్య సాయి బాబా చేసిన కార్యాలు ఈ నాటి కీ ప్రేరణ ను అందిస్తూ ఉన్నాయి." అని ప్రధాన మంత్రి అన్నారు. గుజరాత్ లో భూకంపం సంభవించిన కాలం లో సాయి భక్తులు అందించిన సేవల ను సైతం శ్రీ నరేంద్ర మోదీ ఈ సందర్భం లో స్మరించుకొన్నారు. "సత్య సాయి బాబా యొక్క దీవెనల ను నేను నిరంతరం గా అందుకొంటూ ఉన్నాను. ఇవాళ్టికి కూడా వారి ఆశీర్వాదాలు నాకు లభిస్తూ ఉండటం నాకు లభించినటువంటి ఒక గొప్ప అదృష్టం అని నేను భావిస్తున్నాను." అని ప్రధాన మంత్రి అన్నారు.

మానవాళి కి సేవ చేయాలి అనే భావన పై భారతదేశం-ఫిజీ సంబంధాలు ఆధారపడి ఉన్నాయని ప్రధాన మంత్రి అన్నారు. మహమ్మారి కాలం లో భారతదేశం తన కర్తవ్యాల ను ఈ విలువ ల ఆధారం గా నెరవేర్చగలిగింది, మరి మేం 150 దేశాల కు మందుల ను అందజేశాం. అదేవిధం గా సుమారు 100 దేశాల కు దాదాపు 100 మిలియన్ వేక్సీన్ లను ఇచ్చాం. ఈ ప్రయాసల లో మేం ఫిజీ కి కూడా ఎల్లప్పుడూ ప్రాధాన్యాన్ని ఇచ్చాం అని ఆయన అన్నారు.

ఇరు దేశాల మధ్య సంబంధాల గాఢత గురించి ప్రధాన మంత్రి మరిన్ని వివరాల ను తెలిపారు. రెండు దేశాల మధ్య విశాల సముద్రం ఉన్నప్పటికీ, మన సంస్కృతి మన దేశాల ను కలిపి ఉంచింది. మన సంబంధాలు పరస్పర ఆదరణ, ప్రజల మధ్య గల పటిష్ట బంధాలు ఆధారంగా నిలచి ఉన్నాయి అని ఆయన అన్నారు. ఫిజీ యొక్క సామాజిక అభివృద్ధి లో, ఆర్థిక అభివృద్ధి లో తోడ్పాటు ను అందించే అవకాశాలు భారతదేశాని కి దక్కుతూ ఉండడం భారతదేశానికి సౌభాగ్యం అని ఆయన పేర్కొన్నారు.

ఫిజీ ప్రధాని శ్రీ ఫ్రాంక్ బైనీమరామా పుట్టిన రోజు ఈ రోజు న కావడం తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయన కు శుభాకాంక్షల ను తెలిపారు. శ్రీ ఫ్రాంక్ బైనీమరామా నాయకత్వం లో రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయన్న ఆశాభావాన్ని ప్రధాన మంత్రి వ్యక్తం చేశారు.

పెట్రో ధరలపై మోదీ తప్పుదోవ పట్టిస్తున్నారు: మమతా బెనర్జీ

ముంబై, ఏప్రిల్ 28:: కేంద్రప్రభుత్వం ఇంధన ధరలపై సుంకాలు తగ్గించినప్పటికీ, కొన్ని రాష్ట్రాలు పన్నులు తగ్గించడంలేదని, సహకార సమాఖ్య స్ఫూర్తితో ఇకనైనా ఆయా రాష్ట్రాలు పన్నులను తగ్గించాలని ప్రధాని మోదీ విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. మోదీ వ్యాఖ్యల పట్ల పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన మూడేళ్లలో తమ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై సుమారు 1500 కోట్ల సబ్సిడీ ఇచ్చినట్లు దీదీ అన్నారు. ప్రధాని మోదీ తప్పుదోవ పట్టించేలా వన్‌సైడ్‌గా మాట్లాడినట్లు ఆమె ఆరోపించారు. ప్రధాని వెల్లడించిన అంశాలు అవాస్తవం అన్నారు. పెట్రోల్, డీజిల్‌పై తమ ప్రభుత్వం మూడేళ్ల నుంచి లీటర్‌పై ఒక రూపాయి సబ్సిడీ ఇస్తున్నట్లు ఆమె చెప్పారు.

తమ రాష్ట్రానికి కేంద్రం బాకీ ఉందని, సుమారు 97 వేల కోట్లు కేంద్రం నుంచి రావాలని ఆమె అన్నారు. అయితే తమకు రావాల్సిన అమౌంట్‌లో సగం వచ్చినా.. ఆ మరుసటి రోజే 3000 కోట్ల పెట్రో సబ్సిడీ ఇవ్వనున్నట్లు మమతా బెనర్జీ తెలిపారు. సబ్సిడీతో తనకు సమస్య లేదని, కానీ ప్రభుత్వాన్ని నడపడం ఎలా అని ఆమె ప్రశ్నించారు. సీఎంలతో జరిగిన సమావేశంలో తమకు కౌంటర్ ఇచ్చే అవకాశం రాలేదన్నారు. పెట్రో సబ్సిడీ ఇస్తున్న యూపీ, గుజరాత్ రాష్ట్రాలను మోదీ పొగడడాన్ని ఆమె తప్పుపట్టారు. ఆ రాష్ట్రాలకు కేంద్రం మంచి ఆర్థిక సహకారం అందుతోందన్నారు. రాష్ట్రాలను తప్పుపట్టడం చాలా నీచమైన ఎజెండా అని తృణమూల్ పార్టీ విమర్శించింది. ప్రజాస్వామ్యాన్ని బుల్డోజ్ చేయవద్దు అని ఆ పార్టీ తన ట్వీట్‌లో పేర్కొన్నది.

30న టీటీడీ పాలకమండలి సమావేశం ..

అమరావతి, ఏప్రిల్ 28: తిరుమల, తిరుపతి దేవస్థానం పాలక మండలి సమావేశం శనివారం తిరుమలలో జరుగనుంది. టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి అధ్యక్షతన తిరుమల అన్నమయ్య భవనంలో జరిగే సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. గత ఫిబ్రవరి 17న జరిగిన చివరి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, కొత్తగా చేపట్టబోయే పనులు, కేటాయింపులు తదితర వాటిపై సమావేశం జరుగనుంది. భక్తుల విరాళాలతో నిర్మించతలపెట్టిన కాటేజ్‌ల కేటాయింపులపై వస్తున్న ఆరోపణలపై చర్చించే అవకాశముంది .

ఈ నెల 30 న నవోదయ ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష

మెదక్, ఏప్రిల్ 28 (నేటి నిజం ప్రతినిధి): వర్గల్ లోని నవోదయ విద్యాలయంలో 2022-23 సంవత్సరానికి ఆరవ తరగతిలో చేరేందుకు ఈ నెల 30 న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లా నుండి ప్రవేశ పరీక్షకు హాజరవుతున్న 1,456 మంది విద్యార్థుల కోసం మెదక్ లో 5, నరసాపూర్ లో 3, రామాయంపేట లో 2 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు https://navodaya.gov.in వెబ్‌సైట్ నుండి హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవలసినదిగా ఆయన సూచించారు. కాగా విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయునితో ఐదవ తరగతి చదువుచున్నట్లు సంతకంతో కూడిన సరిఫికేట్ పరీక్షా కేంద్రానికి తీసుకురావాల్సి ఉంటుందని డీఈఓ రమేష్ స్పష్టం చేశారు.

ఆపత్కాలంలో అండగా సీఎంఆర్ఎఫ్ : మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, ఏప్రిల్ 28: ముఖ్యమంత్రి సహాయ నిధిపేదలకు వరమని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం వనపర్తి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎంఆర్ఎఫ్ ఆపత్కాలంలో ఎంతోమంది నిరుపదలకు ఆసరగా నిలుస్తుందన్నారు.

పేద ప్రజలను ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా టీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి వీధి వ్యాపారుల స్వావలంబన నిధి (పీఎం-స్వానిధి) 2022 మార్చి తర్వాత 2024 డిసెంబరు వరకూ కొనసాగించేందుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఇవాళ సమావేశమైన కేంద్ర మంత్రిమండలి ఆర్థిక వ్యవహారాల కమిటీ (సీసీఈఏ) "ప్రధానమంత్రి వీధి వ్యాపారుల స్వావలంబన నిధి" (పీఎం-స్వానిధి) కింద రుణాల మంజూరును 2022 మార్చి తర్వాత 2024 డిసెంబరు వరకూ కొనసాగించడంపై ఆమోదం తెలిపింది. ఈ మేరకు మెరుగైనరీతిలో పూచీకత్తులేని సరళ రుణాల మంజూరుకు తగిన మూలనిధికి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు డిజిటల్ లావాదేవీల అనుసరణ, వీధి వ్యాపారులు-వారి కుటుంబాల సమగ్ర సామాజిక-ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చే నిర్ణయం తీసుకుంది.

ఈ పథకం ద్వారా వీధి వ్యాపారులకు సరళ, పూచీకత్తులేని రుణాలు మంజూరు చేయబడతాయి. దీనికింద మొత్తంమీద రూ.5,000 కోట్లదాకా రుణాలివ్వాలన్నది లక్ష్యం. ఈ నేపథ్యంలో పథకం పొడిగింపునకు నేటి ఆమోదంతో రుణాల మొత్తం రూ.8,100 కోట్లకు పెంచబడింది. తదనుగుణంగా వీధి వ్యాపారులు తమ వ్యాపారం విస్తరించుకుని, స్వావలంబన సాధించేందుకు వీలుగా వారికి నిర్వహణ మూలధనం సమకూర్చబడుతుంది. దీంతోపాటు డిజిటల్ చెల్లింపులపై వ్యాపారులకు నగదు వాపసు సదుపాయం కోసం కూడా నిధులు కేటాయింపు పెంచబడింది.

కంద్ర మంత్రిమండలి తాజా ఆమోదంతో పట్టణ భారతంలోని దాదాపు 1.2 కోట్లమంది పౌరులకు ప్రయోజనం కలుగుతుందని అంచనా.

పీఎం-స్వానిధి పథకం ఇప్పటికే గణనీయ విజయం సాధించింది. ఈ మేరకు 2022 ఏప్రిల్ 25నాటికి 31.9 లక్షల రుణాలు మంజూరు కాగా, 29.6 లక్షల రుణాల కింద రూ. 2,931 కోట్ల మేర సొమ్ము పంపిణీ చేయబడింది.

ఇక 2వ రుణానికి సంబంధించి 2.3 లక్షల రుణాలు మంజూరు కాగా, 1.9 లక్షల రుణాల కింద రూ.385 కోట్లు పంపిణీ చేయబడింది. ఈ పథకం కింద లబ్ధిపొందిన వీధి వ్యాపారులు 13.5 కోట్లకు పైగా డిజిటల్ లావాదేవీలు నిర్వహించటం ద్వారా నగదు వాపసు కింద రూ.10 కోట్లు, వడ్డీ రాయితీ రూపంలో రూ.51 కోట్లు పొందారు.

మహమ్మారి విజృంభణ వల్ల చిన్నవ్యాపారాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడటంతో 2020 జూన్‌లో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే, ఆనాటి విపత్కర పరిస్థితులు నేటికీ తొలగిపోని కారణంగా వారిపై వీధి వ్యాపారులపై ఒత్తిడి కొనసాగుతోంది.

అందుకే ఈ పథకం పొడిగింపు అవసరమైంది. పథకం అమలును 2024 డిసెంబరు వరకూ పొడిగించడంతో అధికారిక రుణమార్గాల అందుబాటు వ్యవస్థీకృతం అవుతుంది. తదనుగుణంగా వ్యాపారులు తమ వ్యాపార విస్తరణకు ప్రణాళిక రూపొందించుకోగలిగేలా కచ్చితమైన రుణవనరుకు హామీ లభిస్తుంది. అలాగే డిజిటల్ లావాదేవీల అనుసరణకు, రుణాలిచ్చే ఆర్థిక సహాయ సంస్థలకు నిరర్థక ఆస్తుల నివారణకు వీలు కలుగుతుంది. దీంతోపాటు వీధి వర్తకులు, వారి కుటుంబాల సంపూర్ణ సామాజిక-ఆర్థిక అభ్యున్నతి సాధ్యమవుతుంది.

చీనాబ్ నదిపై 540 మెగావాట్ల (ఎం.డబ్ల్యు) క్వార్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు నిర్మాణ కార్యకలాపాల వల్ల సుమారు 2500 మందికి ఉద్యోగాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈరోజు 4526.12 కోట్ల రూపాయల పెట్టుబడితో జమ్ము కాశ్మీర్లోని కిస్టవర్ జిల్లా లోని చీనాబ్ నదిపై 540 మెగావాట్ల (ఎం.డబ్ల్యు) క్వార్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు కు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టును మెస్సర్స్ చీనాబ్ వ్యాలీ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (మెస్సర్స్ సివిపిపిఎల్) నిర్మిస్తుంది. ఇది ఎన్‌హెచ్‌పిసి, జెకెఎన్‌పిడిసి సంయుక్త కంపెనీ. 27.04.2022 నాటికి ఇందులో ఎన్ హెచ్‌పిసి వాటా 51 శాతం కాగా, జెకెఎన్‌పిడిసి వాటా 49 శాతంగా ఉంది.

ఈ ప్రాజెక్టు 1975.54 మిలియన్ యూనిట్లను సంవత్సరానికి 90 శాతం అంతకంటే ఎక్కువ విద్యుత్ ను నమ్మకంగా ఉత్పత్తి చేస్తుంది.

భారత ప్రభుత్వం మౌలిక సదుపాయాల ఖర్చుకోసం 69.80 కోట్లు గ్రాంటుగా సమకూరుస్తుంది. అలాగే జెకెఎస్పిడిసి మెసర్స్ సివిపిపిఎల్ లో ఈక్విటీ (49శాతం) కోసం జమ్ము కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి 655.08 కోట్ల రూపాయలను కేంద్రం గ్రాంటుగా సమకూరుస్తుంది. ఎన్.హెచ్.పి.సి 51 శాతం ఈక్విటీని అంటే రూ 681.82 కోట్ల రూపాయలను తన అంతర్గత వనరులనుంచి సమకూరుస్తుంది.. ఈ జల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెకు 54 నెలల వ్యవధిలో పూర్తిఅవుతుంది, ఈ ప్రాజెక్టు నుంచి ఉత్పత్తి అనియన విద్యుత్ గ్రిడ్ బాలెన్సింగ్ఃకు ఉపయోగపడుతుంది. అలాగే విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగుపరుస్తుంది.

కేంద్రపాలిత ప్రభుత్వమైన జమ్ముకాశ్మీర్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఆచరణలోకి తెచ్చేందుకు, నీటి వినియోగ చార్జీలకు ప్రాజెక్టు ప్రారంభమైన నాటి నుంచి పది సంవత్సరాలపాటు మినహాయింపును వర్తింపచేస్తారు.

రాష్ట్ర వాటా జిఎన్‌టి తిరిగి చెల్లింపు(అంటే ఎన్‌జిఎన్‌టి), ఉచిత విద్యుత్‌ను ఏడాదికి రెండు శాతం వంతున డిక్రిమెంటల్ విధానంలో మినహాయిస్తుంది. అంటే కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్ముకాశ్మీర్‌కు ప్రాజెక్టు ప్రారంభమైన తొలి సంవత్సరం ఉచిత విద్యుత్ 2 శాతంగా ఉంటుంది. ఆ తర్వాత ఇది ఏడాదికి 2 శాతం వంతున పెరుగుతూ 6 వ సంవత్సరం , ఆతర్వాత నాటికి ఇది 12 శాతానికి చేరుతుంది.

ఈ ప్రాజెక్టు నిర్మాణ కార్యకలాపాల ప్రభావం ప్రత్యక్షంగా, పరోక్షంగా 2500 మందికి ఉపాధి కల్పిస్తుంది. ఇది మొత్తంగా కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్ము కాశ్మీర్ సామాజిక ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుంది. దీనికితోడు ఇది రూ 4,548.59 కోట్ల రూపాయల ఉచిత విద్యుత్, రూ 4,941.46 కోట్ల రూపాయల నీటి వినియోగ చార్జీల ద్వారా క్వార్ హైడ్రో విద్యుత్ ప్రాజెక్టు 40 సంవత్సరాల కాలంలో జమ్ము కాశ్మీర్ కు ప్రయోజనం దక్కుతుంది.

ఎల్ డబ్ల్యుఈ ప్రాంతాల్లో మెరుగైన ఇంటర్నెట్, డేటా సేవలపై దృష్టి..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గ సమావేశం వామ పక్ష తీవ్రవాద ప్రాబల్య (ఎల్.డబ్ల్యూ.ఈ) ప్రాంతాలలోని భద్రతా శిబిరాల వద్ద వద్ద 2జి మొబైల్ సేవలను 4జి కి అప్ గ్రేడ్ చేయడం కోసం యూనివర్స ల్ సర్వీస్ అబ్లిగేషన్ ఫండ్ (యుఎస్ఒఎఫ్) ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది.

ఈ ప్రాజెక్ట్ 2,343 వామ పక్ష తీవ్రవాద (ఎల్.డబ్ల్యూ.ఈ) ఫేజ్-1 సైట్లను 2జి నుండి 4జి మొబైల్ సేవలకు 1,884.59 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో (పన్నులు, సుంకాలు మినహాయించి) అప్ గ్రేడ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఐదేళ్ల పాటు ఓ అండ్ ఎం కూడా ఉంది. బిఎస్ఎన్ఎల్ తన సొంత ఖర్చుతో మరో ఐదు సంవత్సరాల పాటు ఈ సైట్లను నిర్వహిస్తుంది. ఈ సైట్లు బిఎస్ఎన్ఎల్ కు చెందినవి కాబట్టి ఈ పనిని బిఎస్ఎన్ఎల్ కే అప్పగిస్తారు.

541.80 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఐదు సంవత్సరాల కాంట్రాక్ట్ వ్యవధికి మించి పొడిగించబడిన కాలానికి బిఎస్ఎన్ఎల్ ద్వారా ఎల్ డబ్ల్యుఇ ఫేజ్-1 2జి సైట్ల ఆపరేషన్స్, మెయింటెనెన్స్ ఖర్చుకు నిధులు సమకూర్చడానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 12 నెలల వరకు పొడిగింపు కేబినెట్ ఆమోదం పొందిన తేదీ నుంచి లేదా 4జీ సైట్లను ప్రారంభించే తేదీ నుంచి ఏది ముందు అయితే అప్పటి నుంచి ఉంటుంది.

ఇతర మార్కెట్లకు ఎగుమతి చేయడంతో పాటు దేశీయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి టెలికాం గేర్ విభాగంలో స్వావలంబన సాధించడానికి ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్ కు దేశీయ 4జి టెలికాం పరికరాల ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం ఎంచుకుంది. ఈ ప్రాజెక్టులో కూడా ఈ 4జి ఎక్విప్ మెంట్ ఉపయోగించబడుతుంది.

అప్ గ్రేడేషన్, ఈ ఎల్.ఎస్.డబ్ల్యు ప్రాంతాల్లో మెరుగైన ఇంటర్నెట్, డేటా సేవలను అందిస్తుంది. ఇది హోం మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాల అవసరాలను తీరుస్తుంది. ఈ ప్రాంతాల్లో మోహరించిన భద్రతా సిబ్బంది కమ్యూనికేషన్ అవసరాలను కూడా ఇది తీరుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ కనెక్టివిటీని అందించాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రతిపాదన ఉంది. అదనంగా, వివిధ ఈ- గవర్నెన్స్ సేవలు, బ్యాంకింగ్ సేవలు, టెలి-మెడిసిన్ డెలివరీ; మొబైల్ బ్రాడ్ బ్యాండ్ ద్వారా టెలి ఎడ్యుకేషన్ మొదలైనవి ఈ ప్రాంతాల్లో సాధ్యమవుతాయి.

లిథువేనియాలో భారతీయ మిశన్‌ను తెరవడానికి ఆమోదం తెలిపిన మంత్రిమండలి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:లిథువేనియా లో 2022వ సంవత్సరం లో ఒక కొత్త భారతీయ మిశన్ ను తెరవడాని కి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది

లిథువేనియా లో ఇండియన్ మిశన్ ను తెరిస్తే భారతదేశాని కి దౌత్యపరమైన ఉనికి ని విస్తరించుకోవడం లోను, రాజకీయ సంబంధాల ను మరియు వ్యూహాత్మక సహకారాన్ని బలపరచుకోవడం లోను, ద్వైపాక్షిక వ్యాపారం, పెట్టుబడి, ఇంకా ఆర్థిక కార్యకలాపాల తాలూకు వృద్ధి కి మార్గాన్ని సుగమం చేయడం లోను, ఉభయ దేశాల ప్రజల మధ్య సంబంధాలను మరింత బలపరచడం కోసం రంగాన్ని సిద్ధం చేయడం లోను, బహుపక్షీయ వేదికల లో మరింత నిలకడతనం తో కూడిన రాజకీయ సంబంధాల ను కొనసాగించడం కోసం అనుమతి ని ఇవ్వడంలోను మరియు భారతదేశ విదేశీ వ్యవహారాల విధానం యొక్క ఉద్దేశ్యాల కు సమర్థన ను కూడగట్టడం లోను అండదండలు లభిస్తాయి. లిథువేనియా లో ఏర్పాటు చేసే ఇండియన్ మిశన్ భారతీయ సముదాయాని కి మెరుగైన విధం గా సహాయాన్ని అందించడం తో పాటు వారి ప్రయోజనాల ను పరిరక్షించడాని కి కూడా తోడ్పడగలదు.

లిథువేనియా లో ఒక కొత్త ఇండియన్ మిశన్ ను తెరవాలి అనేటటువంటి నిర్ణయం అభివృద్ధి తాలూకు మన జాతీయ ప్రాధాన్యం మరియు 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' దిశ లో ఒక అగ్రగామి చర్య అని చెప్పవచ్చును. భారతదేశాని కి దౌత్యపరమైన ఉనికి ని విస్తరించుకోవడం అంటే అది ఇతర అంశాల తో పాటు గా, భారతీయ కంపెనీల కు వివణి లభ్యత ను సమకూర్చుతుంది; భారతీయ వస్తువులు, సేవల ఎగుమతుల కు దన్ను గా నిలుస్తుంది. ఇది 'ఆత్మనిర్భర్ భారత్' ను ఆవిష్కరించాలి అనేటటువంటి మన లక్ష్యాని కి అనుగుణం గా దేశీయ ఉత్పత్తి ని మరియు ఉపాధికల్పన ను పెంచడం లో దీని ప్రత్యక్ష ప్రభావం ప్రసరిస్తుంది అన్నమాట.

ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఏర్పాటుకు సవరించిన ఖర్చు అంచనాలకు ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపిపిబి) ఏర్పాటుకు సవరించిన ప్రాజెక్టు పెట్టుబడికి ఆమోదం తెలిపింది. దీనిని 1435 కోట్ల రూపాయలనుంచి 2255 కోట్ల రూపాయలకు పెంచి రెగ్యులేటరీ నిబంధనలకు అనుగుణంగా ఈక్విటీని సమకూరుస్తారు. అలాగే రెగ్యులేటరీ అవసరాలు, సాంకేతికతను అప్‌గ్రేడ్ చేయాడానికి మరో 500 కోట్ల రూపాయలను భవిష్యత్ లో నిధులను సమకూర్చడానికి కూడా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

ఈ ప్రాజెక్టు లక్ష్యం, అందుబాటులో, చవకగా బ్యాంకింగ్ సేవలను సామాన్యుడికి అందుబాటులోకి తేవడం. బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని వారికి అడ్డంకులు తొలగించడం, ఇంటివద్దకే బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం. ఈ ప్రాజెక్టు , తక్కువ నగదు చలామణి కి సంబంధించి భారత ఆర్థిక వ్యవస్థ దార్శనికతకు అద్దం పడుతుంది. అలాగే ఇది ఆర్థిక ప్రగతికి, ఆర్థిక సమ్మిళితత్వానికి దోహదపడుతుంది.

ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ 2018 సెప్టెంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా 650 బ్రాంచ్‌లు, కంట్రోలింగ్ ఆఫీసులలో ప్రారంభమైంది. ఐపిపిబి కి 1.36 లక్షల పోస్ట్ ఆఫీసులు ఉన్నాయి. ఇవి బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నాయి. 1.89 లక్షల పోస్ట్‌మెన్, గ్రామీణ్ డాక్ సేవక్ లు స్మార్ట్ ఫోన్, బయోమెట్రిక్ పరికరాల ద్వారా ఇంటిగుమ్మం వద్దకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తెస్తున్నారు.

ఐపిపిబి ని ప్రారంభించినప్పటి నుంచి ఇది 5.25 కోట్ల ఖాతాలను ప్రారంభించింది. సుమారు 82 కోట్ల ఆర్థిక లావాదేవీలు సుమారు రూ 1,61.811 కోట్ల రూపాయల మేరకు జరిగాయి . దీనికి తోడు 765 లక్షల ఎఇపిఎస్ లావాదేవీలు సుమారు 21 వేలా 343 కోట్ల రూపాయల మేరకు జరిగాయి. 5 కోట్ల ఖాతాలలో? 77 శా3తం ఖాతాలు గ్రామీణ ప్రాంతాలలో ప్రారంభమైనవి. ఇందులో 48 శాతం మహిళా కస్టమర్లు. వెయ్యి కోట్ల డిపాజిట్లు కలిగి ఉంది. సుమారు 40 లక్షల మంది మహిళా కస్టమర్లు ప్రత్యక్ష నగదు బదిలీ (డిబిటి) కింద 2500 కోట్ల రూపాయలు తమ ఖాతాలో అందుకున్నారు. సుమారు 7.8 లక్షల ఖాతాలు పాఠశాల విద్యార్థుల పేరుమీద ప్రారంభించారు.

ఆకాంక్షిత జిల్లాలలో ఐపిపిబి సుమారు 95.71 లక్షల ఖాతాలను తెరిచింది. ఇందులో సుమారు 602 లక్షల లావాదేవీలు రూ 19,487 కోట్ల రూపాయల మేరకు జరిగాయి. వామపక్ష తీవ్రవాదం (ఎల్ డబ్ల్యు ఇ) ఉన్న జిల్లాలలో 67.20 లక్షల ఖాతాలను ఐపిపిబి ప్రారంభించింది. సుమారు426 లక్షల లావాదేవీలలో 13, 460 కోట్ల రూపాయలు బదిలీ అయింది. ఈ ప్రతిపాదన ల మొత్తం ఆర్థిక వ్యయం రూ.820 కోట్లు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్ నెట్‌వర్క్‌ను ఉపయోగించుకోవడం ద్వారా భారతదేశం అంతటా ఆర్థిక సేవలను మరింతగా పెంచే లక్ష్యంతో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్‌కు ఈ నిర్ణయం సహాయం చేస్తుంది.

ఆయిల్ ఫామ్ సాగు చేసి అధిక లాభాలు పొందాలి : మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 28: : రైతులంతా ఆయిల్ ఫామ్‌ను పెద్ద ఎత్తున సాగు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిహరీశ్ రావు రైతులకు పిలుపు నిచ్చారు. గురువారం దుబ్బాక మండలం పోతరెడ్డిపేట గ్రామంలో 50 మంది డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించారు. అనంతరం పోతరెడ్డి పేట క్లస్టర్ రైతు వేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఉక్రెయిన్, రష్యా యుద్ధం తర్వాత వంటనూనె ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి.

ఈ మధ్యకాలంలో మలేషియా, ఇండోనేషియాలు ఆయిల్ ఫామ్ ఎగుమతి నిషేధించాయి. కారణం వంటనూనె ధరల పెంపు, తమదేశ ప్రజలకే వంటనూనె అవసర రీత్యా ఆయా దేశాలు వంటనూనె ఎగుమతిని నిషేధించాయన్నారు. ఈ క్రమంలో భారతదేశంలో వంటనూనెలకు పెద్ద ఎత్తున కొరత ఏర్పడుతున్నదని మంత్రి తెలిపారు. దీంతో ఆయిల్ ఫామ్ సాగుకు మంచి డిమాండ్ ఏర్పడిందన్నారు. ఆయిల్ ఫామ్ చాలా లాభసాటి పంట. ఆయిల్ ఫామ్ పంటలో చీడ పీడ బాధ లేదు. పందులు, కోతుల బెడద లేదు. గెల, కమ్మ కొ

కేసీఆర్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీఆర్ఎస్‌లోకి : మంత్రి మల్లారెడ్డి

రంగారెడ్డి, ఏప్రిల్ 28:సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీ నాయకులు తెరాస పార్టీలో చేరుతున్నారని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. మూడుచింతలపల్లి మండలం నారాయణపూర్ గ్రామంలో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీజేపీ నుండి గ్రామ ఉప సర్పంచ్ హన్మంతు, జె బాబు వార్డ్ మెంబెర్, శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నుండి కవిత కాంగ్రెస్ పార్టీ మహిళా జనరల్ సెక్రటరీ, టి.నాగరాజు, కాంగ్రెస్, బీజేపీ పార్టీల కార్యకర్తలు దాదాపు 50మంది తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో చేరారు. వారికి కడువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు మంత్రి మల్లారెడ్డి. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం తెరాస పార్టీ ఇంచార్జ్ మహేందర్ రెడ్డి, ఎంపీపీ హారిక మురళి గౌడ్, సర్పంచ్ రాంచంద్రయ్య, నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

భారతదేశాన్ని రెండవ అతిపెద్ద సీఈ మార్కెట్‌గా ప్రపంచంలో నిలిపేందుకు ప్రయత్నిస్తోన్న సీఐఐ ఎక్స్‌కాన్

హైదరాబాద్, ఏప్రిల్ 28:కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఓ రోడ్‌షోను నగరంలో నేడు నిర్వహించడంతో పాటుగా ఎక్స్‌కాన్‌ను నిర్వహించబోతున్నట్లు వెల్లడించింది. పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, పరిశ్రమ నాయకులు, మౌలిక వసతులు, నిర్మాణ రంగ ప్రతినిధులు ఈ రోడ్ షోలో పాల్గొన్నారు.

దక్షిణాసియాలో అతిపెద్ద నిర్మాణ యంత్ర సామాగ్రి మరియు నిర్మాణ సాంకేతికత వాణిజ్య ఫెయిర్, ఎక్స్‌కాన్‌ను మే 17?21, 2022 తేదీలలో బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ వద్ద సీఐఐ నిర్వహించనుంది.

దాదాపు మూడు లక్షల చదరపు మీటర్ల డిస్‌ప్లే ఏరియాలో నిర్వహించబోయే ఎక్స్‌కాన్‌లో భారతదేశంతో పాటుగా యుఎస్ఏ, యుకె, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, యుఏఈ, దక్షిణ కొరియా, సింగపూర్, శ్రీలంక లాంటి దేశాల నుంచి 1000 మందికి పైగా ఎగ్జిబిటర్లు పాల్గొననున్నారు. ఐదు రోజుల పాటు జరుగనున్న ఈ ప్రదర్శనలో ప్రపంచవ్యాప్తంగా 40వేల మంది వ్యాపార సందర్శకులు పాల్గొననున్నారని అంచనా.

ఎక్స్‌కాన్ 2021 స్టీరింగ్ కమిటీ సభ్యుడు మరియు పుజ్జాలొనా గ్రూప్ చీఫ్ ఎడ్వైజర్ టీ ఆర్ భరతన్ మాట్లాడుతూ "ఎక్స్‌కాన్ 11వ ఎడిషన్ ఇది. ఈ సంవత్సరం 'నూతన ప్రపంచం కోసం భారతదేశ నిర్మాణం : పోటీతత్త్వం, వృద్ధి, సస్టెయినబిలిటీ, టెక్నాలజీ' నేపథ్యంతో దీనిని చేస్తున్నాం. స్మార్ట్ సాంకేతికతల పాత్రను ఎక్స్‌కాన్ ఉదహరించడంతోపాటుగా భారతదేశపు మౌలిక వసతుల అభివృద్ధిలో ఆవిష్కరణలను సైతం ప్రదర్శించనుంది. 2030 నాటికి నిర్మాణ యంత్ర సామాగ్రి తయారీకి అంతర్జాతీయ కేంద్రంగా ఇండియాను నిలుపాలన్నది లక్ష్యం" అని అన్నారు.

సీఐఐ తెలంగాణా ఛైర్మన్ మరియు అల్పా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వజీష్ దీక్షిత్ మాట్లాడుతూ "మౌలిక వసతుల ప్రాజెక్టులను వేగవంతంగా అమలులోకి తీసుకురావడానికి ప్రపంచ శ్రేణి సాంకేతికతలు స్వీకరించడం ప్రోత్సహించాల్సి ఉంది. నిర్మాణ యంత్ర సామాగ్రి రంగంలో ప్రపంచ శ్రేణి సంస్థలు పాల్గొనడం వల్ల అత్యుత్తమ సాంకేతికతలు అందుబాటులోకి రావడం మాత్రమే కాదు, తక్కువ ధరల పరిష్కారాల పట్ల కూడా అవగాహన కలుగనుంది"అని అన్నారు.

IN THE COURT OF THE M.A.C.T-CUM-XII ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT AT SECUNDERABAD
M.V.O.P. NO.314 OF 2018
Between:
Mrs M. Rajitha and Others
.....Petitioners
And
Mr.D. Nagaraju and others
..Respondents
Mr. Dasari Narsimulu
S/o. D. Sailoo, Age: Major
Occ: Owner of Tralley bearing No.AP 23X 4448, H.No.7-129
Gajulapally Village,
Doultabad Mandal, Siddipet Dist, Telangana
...Respondents No.4
Whereas the above named Petitioner filed compensation petition against you and Cholamandalam MS General Insurance Co. Ltd, for a sum of Rs.15,00,000/- for the accident caused by your vehicle Tralley bearing No.AP 23X 4448 on 29-09-2017 at Doulthabad ps Limites. The above case is posted to **10-05-2022.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 10.30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the suit will be heard and determined expate.
(BY ORDER OF THE HONBLE COURT)
C. VENU GOPAL REDDY
A.POORNA CHANDRA RAO
Advocates.
off: 2-4-120/18,
Swaroop Nagar
Uppal, Hyderabad
Ph: 9440431541

IN THE COURT OF THE M.A.C.T-CUM-XXVII ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT AT SECUNDERABAD
M.V.O.P. NO.605 OF 2020
Between:
Mr. Mohd Khuddus Uddin
.....Petitioner
And
Mr.Mohd Khalids and others
..Respondents
Mr. Mohd Khalids,
S/o. Mohammed, Age: Major
Occ: Crane Operator
R/o. Plot No. 273, Lal Bungla,
New Bowenpally,
Secunderabad.
...Respondents No.1
Whereas the above named Petitioner filed compensation petition against you and The Oriental Insurance Company for a sum of Rs.2,00,000/- for the accident caused by your vehicle Crane bearing No.AP 10BD 0824 on 19-05-2015 at Jubilee Hills ps Limites. The above case is posted to **02-05-2022.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 10.30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the suit will be heard and determined expate.
(BY ORDER OF THE HONBLE COURT)
C. VENU GOPAL REDDY
A.POORNA CHANDRA RAO
Advocates.
off: 2-4-120/18,
Swaroop Nagar
Uppal, Hyderabad
Ph: 9440431541

ఆయుష్మాన్ భారత్-హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లు సరికొత్త కొత్త మైలురాయిని చేరాయి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28:ఆయుష్మాన్ భారత్ కు చెందిన హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లు కమ్యూనిటీలకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించే మిషన్‌లో సరికొత్త మైలురాయిని అధిగమించాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు చెందిన ఫ్లాగ్‌షిప్ టెలిమెడిసిన్ స్కీమ్- "ఈసంజీవని" ద్వారా 2022 ఏప్రిల్ 26 మరియు ఏప్రిల్ 27న వరుసగా రెండు రోజులలో రికార్డు స్థాయిలో 3.5 లక్షల టెలి-కన్సల్టేషన్‌లు నమోదు చేయబడ్డాయి.ఏబీ-హెచ్ డబ్ల్యూసీల వద్ద ఒకే రోజు జరిగిన అత్యధిక సంఖ్యలో టెలికన్సల్టేషన్‌లైన రోజుకు 3 లక్షల టెలికన్సల్టేషన్‌ల రికార్డును అధిగమించింది. వీటికి అదనంగా 2022 ఏప్రిల్ 26 మరియు 27 తేదీలలో ఈ-సంజీవనిఓపీడీ టెలిమెడిసిన్ అందించిన సేవలను 76 లక్షల మందికి పైగా రోగులు అందుకున్నారు.

ఈ రికార్డు సాధన ఈ-సంజీవని ప్లాట్‌ఫారమ్ కు ఉన్న బలమైన సాంకేతికతకు నిదర్శనం. దాదాపు 1 లక్ష ఏబీ-హెచ్ డబ్ల్యూసీలు ఇప్పటికే సంప్రదింపులు కోరుతూ స్పోక్స్‌గా నమోదు చేసుకున్నారు మరియు 25,000 కంటే ఎక్కువ హబ్‌లు టెలికన్సల్టేషన్‌లను అందిస్తున్నాయి, ఈ-సంజీవని పోర్టల్ దేశవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ సేవలకు ప్రాప్యతను సులభతరం చేస్తోంది. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కోసం టెలి-కన్సల్టేషన్‌లలో స్థిరమైన పెరుగుదల అంత్యోదయ వైపు ఒక పెద్ద అడుగు. దేశంలోని సుదూర మరియు మారుమూల ప్రాంతాల ప్రజలు దీనిద్వారా నాణ్యమైన మరియు సరసమైన ఆరోగ్య సంరక్షణను పొందగలుగుతారు. దేశంలోని మారుమూల ప్రాంతంలో ఉన్న పేదలకు సకాలంలో నిపుణుల సేవలను అందించడానికి టెలికన్సల్టేషన్‌లు ఒక వరంలా ఉద్భవించాయి.ప్రపంచంలోనే మొట్ట మొదటి టెలిమెడిసిన్ చొరవ అయిన ఈ-సంజీవనిలో రెండు రకాలు ఉన్నాయి:

ఈ-సంజీవని ఆయుష్మాన్ భారత్-హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ (ఏబీ-హెచ్ డబ్ల్యూసీ): గ్రామీణ ప్రాంతాలు మరియు వివిక్త కమ్యూనిటీలలో సాధారణ మరియు ప్రత్యేక ఆరోగ్య సేవలను అందించడానికి భారత ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్-హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్స్ పథకం కింద డాక్టర్-టు-డాక్టర్ టెలిమెడిసిన్ సేవ. డాక్టర్-టు-డాక్టర్ టెలిమెడిసిన్ సర్వీస్ హబ్-అండ్-స్పోక్ మోడల్‌పై ఆధారపడి ఉంటుంది. 'ఈసంజీవని హెచ్ డబ్ల్యూసీ' స్పోక్ వద్ద లబ్ధిదారు (పారామెడిక్ మరియు జనరల్‌తో పాటు) అంటే హెచ్ డబ్ల్యూసీ మరియు హబ్‌లోని డాక్టర్/స్పెషలిస్ట్ (తృతీయ ఆరోగ్య సంరక్షణ సౌకర్యం/హాస్పిటల్/మెడికల్ కాలేజీ) మధ్య వర్చువల్ కనెక్షన్‌ని అనుమతిస్తుంది. ఇది స్పోక్ వద్ద పారామెడిక్స్ ద్వారా లబ్ధిదారుతో హబ్‌లోని వైద్యులు ద నిపుణుల నుండి నిజ-సమయ వర్చువల్ సంప్రదింపులను సులభతరం చేస్తుంది. సెషన్ ముగింపులో రూపొందించబడిన ఇ-ప్రిస్క్రిప్షన్ మందులను పొందేందుకు ఉపయోగించబడుతుంది. భౌగోళికం, యాక్సెసిబిలిటీ, ఖర్చు మరియు దూరం వంటి అవరోధాలను అధిగమించి సమాచార సాంకేతిక పరిజ్ఞానం యొక్క సంభావ్యతను ఉపయోగించుకోవడం ద్వారా గరిష్ట సంఖ్యలో పౌరులకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించాలనే లక్ష్యంతో 'ఈ-సంజీవని హెచ్ డబ్ల్యూసీ' అమలు చేయబడుతోంది.

ప్రస్తుతం ఈ-సంజీవని హెచ్ డబ్ల్యూసీ 80,000 కంటే ఎక్కువ హెల్త్ ఉ వెల్నెస్ సెంటర్లలో పనిచేస్తోంది. మారుమూల ప్రాంతాలతో సహా దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రతి రోజు (ఏప్రిల్ 26 మరియు ఏప్రిల్ 27) 2.70 లక్షల కంటే ఎక్కువ మంది వైద్యులకు సాధారణ మరియు ప్రత్యేక వైద్యుల నుండి వైద్యునికి టెలిమెడిసిన్ ఆరోగ్య సేవలు అందించబడ్డాయి.

ఈ-సంజీవనిఓపీడీ: ఇది ప్రజలు తమ ఇళ్లలో ఔట్ పేషెంట్ సేవలను పొందేందుకు వీలుగా పేషెంట్-టు-డాక్టర్ టెలిమెడిసిన్ సర్వీస్. 'ఈ-సంజీవనిఓపీడీ' కూడా దేశంలోని అన్ని ప్రాంతాల పౌరులకు వేగంగా మరియు విస్తృతంగా అందించబడుతుంది. ఇది ఆండ్రాయిడ్ మరియు ఐవోఎస్ ఆధారిత స్మార్ట్‌ఫోన్‌ల కోసం మొబైల్ యాప్‌గా అందుబాటులో ఉంది మరియు ఈ యాప్‌లు 3 మిలియన్లకు పైగా డౌన్‌లోడ్‌లు అయ్యాయి.

ముస్లిం సోదరులకు సెహ్రీ ఇవ్వడం అనందంగా ఉంది : ఎంపీ సంతోష్ కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 28:పవిత్ర రంజాన్ మాసంలో ఈ కార్యక్రమంలో పాల్గొని ముస్లిం సోదరులకు సెహ్రీ ఇవ్వడం అనందంగా ఉందని ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ అన్నారు. జీహెచ్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఆధ్వర్యంలో బోరబండలో ముస్లిం సోదరులు తెల్లవారుజామున 5 గంటల లోపు తీసుకునే సెహ్రీ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం సోదరులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఎంపీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ? గత ఆరు సంవత్సరాలుగా బాబా ఫసీయుద్దిన్ అధ్వర్యంలో ప్రతిరోజు దాదాపు 400 మంది ముస్లీం సోదరులకు తెల్లవారుజామున భోజనాలు అందించడం చాలా గొప్పవిషయమని కొనియాడారు. హిందూ సోదరులు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ వారికి భోజనాలు వడ్డించడం చాలా గొప్ప విషయమని తెలంగాణ రాష్ట్రం మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ఇంతమంచి కార్యక్రమం చేపట్టిన బాబా ఫసీయుద్దిన్‌ను ఎంపీ సంతోష్ కుమార్ అభినందించారు.

అనంతరం మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ బోరబండ డివిజన్ లో రంజాన్ మాసంను పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెహ్రీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ చేతుల మీదుగా ఉపవాసం ఉన్న ముస్లిం సోదరులకు సెహ్రీ భోజనాలు వడ్డించడం సంతోషంగా ఉందన్నారు. గంగా జమున తహెజీబ్ కనిపిస్తుందంటే అది తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరంలో కనిపిస్తోందని, ఉపవాసం ఉన్న ముస్లిం సోదరులకు భోజనాలు వడ్డించేందుకు హిందు, క్రైస్తవ సోదరులు వచ్చి పాల్గొంటారన్నారు. ఎంపీ సంతోష్ కుమార్ తన చేతుల మీదుగా ఉపవాసం ఉన్న సోదరులకు భోజనం వడ్డించడంతో ముస్లిం సోదరులు ఎంపీ సంతోష్ కుమార్ కి దువా ఇవ్వడం జరిగిందని, అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, వారి కుటుంబ సభ్యులు ఆయుఆరోగ్యాలతో ఉండాలని దువా ఇవ్వడం జరిగిందని బాబా ఫసియుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు కిషోర్ గౌడ్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో ఫౌండర్ రాఘవ, స్థానిక టీఆరెస్ నాయకులు, ముస్లిం మత పెద్దలు, హిందూ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలతో పనులు చేసుకోవచ్చు : మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 28:కృత్రిమ అవయవాలు అమర్చుకోవడం ద్వారా వారు రోజు వారి పనులు సాధారణంగా చేసుకోవచ్చని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి తెలిపారు. మల్లారెడ్డి యూనివర్సిటీ ప్రాంగణంలో దివ్యాంగులకు కృత్రిమ చేతుల అమరిక కార్యక్రమం ఏర్పాటు చేసి వందలాది మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అమర్చారు. ఈ కార్యక్రమానికి మంత్రి మల్లారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. రోటరీ క్లబ్, మల్లారెడ్డి యూనివర్సిటీ వారు సంయుక్తగా ఎల్ ఎన్ 4 స్వచ్ఛంద సంస్థ కలిసి దాదాపు 700మంది దివ్యాంగులకు కృత్రిమ చేతులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దాదాపు 700 మంది దివ్యాంగులకు ఈ కృత్రిమ చేతులు అమర్చడం జరిగిందన్నారు. ఒక్కొక్క చేయి విలువ దాదాపు 1లక్ష రూపాయలు ఉంటుందన్నారు. రూ.7 కోట్ల వెచ్చించి ఈ కార్యక్రమం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన దివ్యాంగులకు వారి అటెండెర్స్ కు నీళ్లు, భోజనం అన్ని నదుపాయాలు కల్పించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు గౌరిష్, మోహన్, శ్రీదేవి, మల్లారెడ్డి యూనివర్సిటీ యాజమాన్యం ఛాన్సెలర్ కల్పనా మల్లారెడ్డి, వైస్ ఛాన్సెలర్ వీఎస్ కే రెడ్డి, డా.శిరోలే, డా.మల్లికార్జున్, హరి ప్రియా, సౌజన్య, తదితరులు

దుగ్గిరాల బాధితురాలి కుటుంబానికి రూ. 10 లక్షల పరిహారం

అమరావతి, ఏప్రిల్ 28: గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో మహిళ అత్యాచారం, హత్యకు గురైన ఘటనపై ఏపీ ప్రభుత్వం స్పందించింది. తెనాలి ఆస్పత్రిలో మృతురాలు తిరుపతమ్మ కుటుంబాన్ని మంత్రి నాగార్జున, ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, ఎమ్మెల్యేలు సుచరిత, రామకృష్ణ రెడ్డి పరామర్శించారు. మృతురాలి కుటుంబానికి రూ. 10 లక్షలు పరిహారం అందజేస్తామని మంత్రి ప్రకటించారు.

మృతురాలి ఇద్దరు పిల్లల చదువు బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, ఆ కుటుంబానికి స్థలంతో పాటు ఇళ్లు కట్టించి ఇస్తామని మంత్రి తెలిపారు. కాగా దుగ్గిరాల ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసిందని ఆయన వెల్లడించారు. గ్యాంగ్ రేప్ జరగలేదని వివరించారు. కోరిక తీర్చలేదని సాయి ఆమె చీరనే మెడకు బిగించి శివసత్య సాయిరాం అనే నిందితుడు చంపివేశాడని పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో నూతన రీనీ కాస్మెటిక్స్ స్టోర్‌ను ప్రారంభించిన రష్మీ గౌతమ్

హైదరాబాద్, ఏప్రిల్ 28:ఆఫ్‌లైన్ విస్తరణను విజయవంతంగా కొనసాగించాలనే తమ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తూ, బ్యూటీ బ్రాండ్ రీనీ కాస్మెటిక్స్ ఇప్పుడు తమ తరువాత గమ్యస్థానంగా హైదరాబాద్‌ను ఎంచుకుంది. తెలుగునటి రష్మీ గౌతమ్ వీరి నూతన స్టోర్‌ను జూబ్లీహిల్స్ వద్ద ప్రారంభించారు. డిజిటల్ ఉనికి పరంగా అపూర్వ విజయం సాధించిన బ్రాండ్, భారతదేశంలో అగ్రగామి బ్యూటీ బ్రాండ్లలో ఒకటిగా నిలిచింది. రీనీ కాస్మెటిక్స్ ఇప్పుడు దేశ వ్యాప్తంగా విస్తృత స్థాయిలో విస్తరణ ప్రణాళికలపై దృష్టి సారించింది.

ఈ స్టోర్‌ను ప్రారంభించిన అనంతరం రష్మీ గౌతమ్ మాట్లాడుతూ "రీనీతో భాగస్వామ్యం ఏర్పాటుచేసుకోవడం పట్ల చాలా సంతోషంగా ఉన్నాను. మేకప్‌కు సంబంధించి నేను అమితంగా ఇష్టపడే బ్రాండ్లలో ఇది ఒకటి.తమ ఆవిష్కరణలతో వీరు మేకప్ విభాగాన్ని పునర్నిర్వచించారు. అత్యుత్తమంగా తీర్చిదిద్దిన ఉత్పత్తి శ్రేణి వీరికి ఉంది. ఇవి భారతీయ చర్మానికి తగినట్లుగా ఉంటాయి. నన్ను అమితంగా ఆకట్టుకున్న అంశమేమిటంటే ఎలాంటి జంతు ఉత్పత్తులూ వీటిలో వాడకపోవడం. అందువల్ల మనం మరింత ఆప్రమత్తతతో ఎంచుకోవడం వీలవుతుంది" అని అన్నారు.

కో ?ఫౌండర్ ప్రియాంక్ షా మాట్లాడుతూ "అత్యంత కీలకమైన మెట్రో నగరాలలో హైదరాబాద్ ఒకటి. మా విస్తరణ ప్రణాళికలో ఈ నగరం ఎప్పుడూ ముందే ఉంటుంది. ఇక్కడ ఉన్న మార్కెట్ కారణంగా మా వినూత్నమైన ఉత్పత్తి శ్రేణి ఇక్కడి మహిళలకు అందిస్తున్నాం. గత కొద్ది నెలలుగా మేము అందుకుంటున్న స్పందన పట్ల మేము చాలా సంతోషంగా ఉన్నాము. త్వరలోనే దేశవ్యాప్తంగా మరిన్ని నగరాలకు విస్తరించనున్నాము" అని అన్నారు.

ఆస్కా గోరాడియా గోబెల్ తో పాటుగా అషుతోష్ వలానీ మరియు ప్రియాంక్ షా ప్రారంభించిన రీనీ కాస్మెటిక్స్, ఎఫ్‌డీఏ అనుమతి పొందినక్రూయాల్టీ ఫ్రీ బ్రాండ్ ఇది.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఏనుగు మనోహర్ రెడ్డి

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 28:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని మార్కెట్ వీధిలో ఇటీవల మరణించిన మేకల రామకృష్ణ కుటుంబాన్ని తెరాస సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మృతి పట్ల ఏనుగు మనోహర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేసి, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ సరాల శేఖర్ తదితరులు ఉన్నారు.

దారుల్ అన్సార్ సొసైటీ సేవలు అభినందనీయం..

-నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి
-200 మంది పేదలకు ఈద్ సామగ్రి..300 నగదు పంపిణీ

కరీంనగర్ , ఏప్రిల్ 28:(నేటినిజం ప్రతినిధి): రంజాన్ పండుగ సందర్భంగా దారుల్ అన్సార్ సొసైటీ సేవలు అభినందనీయమని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం షబే ఖదర్ సందర్భంగా కశ్మీర్ గడ్డలోని శాలిమార్ ఫంక్షన్ హాల్లో 200 మంది పేదలకు 300 రూపాయల నగదు, సెమియాలు ఈద్ సామగ్రిని పంపిణీ కార్యక్రమాన్ని దారుల్ అన్సార్ సొసైటీ నిర్వాహకుడు హాఫిజ్ సయ్యద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోమటిరెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో దారుల్ అన్సార్ సొసైటీ పేద ముస్లింలకు సాయం అందించడం, పండుగ సందర్భంగా పేదల ఇండ్లలో సంతోషాలు నింపడం హర్షణీయమన్నారు. పేదలను ఆదుకునేందుకు దారుల్ అన్సార్ సొసైటీ వంటి సంస్థలు ముందుండాలని కోరారు. ప్రతి సంవత్సరం ఇలాంటి ఎన్నో సేవా కార్యక్రమాల్లో ముందుండి చేపడుతున్న హాఫిజ్ రిజ్వాన్ ను కోమటిరెడ్డి అభినందించారు. రంజాన్ పండుగను నగర ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రతి ఒక్కరి జీవితంలో పండుగ నూతన కాంతులు వెదజల్లాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా దారుల్ అన్సార్ సొసైటీ నిర్వాహకులు కోమటిరెడ్డి ని శాలువతో ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శహింషా, నదీమ్, హాఫిజ్ లుక్మాన్, వసీం తదితరులు ఉన్నారు.

అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకి స్వచ్ఛత పురస్కారం..

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 28:(నేటినిజం ప్రతినిధి): అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు స్వచ్ఛత పురస్కారం వరించినట్లు ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి మహాత్మా గాంధీ గ్రామీణ విద్యా మండలి కళాశాల విద్యాశాఖ వారు అగ్రహారం కళాశాలను జిల్లా గ్రీన్ చాంపియన్ అవార్డు 2021-22కు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నీటి పొదుపు, సౌరశక్తి నిర్వహణ, హరిత నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ, స్థల ఉపయోగ నిర్వహణ, తదితర 6 సూచీల ఆధారంగా ఈ కళాశాలని జిల్లాస్థాయి పురస్కారానికి ఎంపికైనట్లు తెలిపారు. బుధవారం నాడు హైదరాబాద్ లో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ ఈ అవార్డును అందుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి ఈ అవార్డును కళాశాల కైవసం చేసుకున్నందుకు గాను కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

మార్కెట్లోకి టి టి కె ప్రెస్టీజ్ కొత్త ప్లాటినా నాన్-స్టిక్ రేంజ్ స్టెయిన్‌లెస్ స్టీల్ ఉత్పత్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 28:ప్లాటినా నాన్-స్టిక్ రేంజ్‌తో మీ వంటసామాను ఎలివేట్ చేయండి, ఇది స్టెయిన్‌లెస్-స్టీల్ నాన్-స్టిక్ కుక్‌వేర్ శ్రేణికి సొగసైన అదనంగా ఉంటుంది. ఇంట్లో వంట చేసేవారు స్టెయిన్‌లెస్ స్టీల్ యొక్క స్వచ్ఛతను నాన్-స్టిక్ సౌలభ్యంతో ఆనందించవచ్చు. ప్లాటినా అనేది ఒక ప్రత్యేకమైన నాలుగు పొరల నాన్-స్టిక్ కోటెడ్ స్టెయిన్‌లెస్ స్టీల్ వంటసామాను శ్రేణి, ఇది తక్కువ నూనెను ఉపయోగిస్తుంది, ఇది స్క్రాచ్ రెసిస్టెంట్ మరియు మెటల్ స్పూన్ ఫ్రెండ్లీ. దాని దృఢమైన వేడి నిరోధక హ్యాండిల్స్ వంట చేసేటప్పుడు సులభంగా హ్యాండిల్ చేయడానికి అనుమతిస్తుంది. అన్ని విధాలుగా ఉన్నతమైనది, ప్లాటినా నాన్-స్టిక్ మీ వంటగదికి సరైన జోడింపుహైదరాబాద్, ఏప్రిల్: టి టి కె ప్రెస్టీజ్ వంట సామాగ్రి శ్రేణిని ప్రత్యేకమైన ఇంపాక్ట్ ఫోర్డ్ బాటమ్‌తో సన్నద్ధం చేయడంతోపాటు ఆహారం వేగంగా సమానంగా ఉడుకుతుందని నిర్ధారించింది. గట్టి గాజు మూత మరియు వేడిని తట్టుకునే హ్యాండిల్స్ ప్రతి వంటగదిలో తప్పనిసరిగా ఉండాల్సినవి. ప్లాటినా నాన్-స్టిక్ రేంజ్ బర్నింగ్, అసమాన వంటలను నివారించడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది. అదనపు సౌలభ్యం కోసం, ప్లాటినా గ్యాస్ స్టవ్‌లు, ఇండక్షన్ కుక్‌టాప్‌లపై పనిచేస్తుంది. శ్రేణిలో మూతలు ఫ్లైయింగ్ ప్యాన్‌లతో కూడిన కడైలు ఉంటాయి అని సంస్థ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

ఇంటర్, టెన్త్ ఎగ్జామ్స్ పకడ్బందీగా నిర్వహించాలి : మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 28:మే నెలలో ప్రారంభం కాబోయే ఇంటర్, టెన్త్ ఎగ్జామ్స్ ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. ఇంటర్, పది పరీక్షలపై గురువారం జిల్లాల కలెక్టర్లతో ఎడ్యుకేషన్ మినిస్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొవిడ్ భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పరీక్షలు నిర్వహిం చాలని